Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి :1 సంచిక :299 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 నవంబర్ 2023 శుక్రవారం పేజీలు :4

## బీజేపీ పాలిత రాష్ట్రాలు కులగణన ఎందుకు చేయట్లేదు?

### మోదీకి కాంగ్రెస్ సూటి ప్రశ్న

ఢిల్లీ: దేశంలోని పలు రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపడుతుంటే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేపట్టట్లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రాం రమేశ్ ప్రధాని మోదీని ప్రశ్నించారు. రాజస్థాన్‌లోని అశోక్ గహ్లోత్ సర్కార్ కులగణన చేపట్టనున్నట్లు ప్రకటించిన మరుసటి రోజు రమేశ్ స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, హక్కుల కోసం చేపట్టే కులగణన అంశంపై ప్రధాని మోదీ ఎందుకు సైలెంట్‌గా ఉంటున్నారని ప్రశ్నించారు. రాజస్థాన్‌లో భారత్ జోడో యాత్ర జరుగుతున్నప్పుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అనేక కుల సంఘాల సభ్యుల కలిసి ఇదే విషయాన్ని విన్నవించారని తెలిపారు. వారి వినతిని రాహుల్ సీరియస్ గా తీసుకున్నారని.. అందుకే రాజస్థాన్ లో కులగణన చేపట్టనున్నట్లు వెల్లడించారు.




# దూసుకుపోతున్న కాంగ్రెస్!!

## నేడు వరంగల్ కు రాహుల్ గాంధీ

## ఒకేరోజు ఐదు నియోజకవర్గాలలో రాహుల్ గాంధీ ప్రచారం

వరంగల్ : తెలంగాణలో రేపు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటించనున్నారు. ఒకేరోజు ఐదు నియోజకవర్గాలలో రాహుల్ గాంధీ ప్రచారాన్ని నిర్వహించనున్నారు. కార్నర్ మీటింగ్లు, రోడ్ షోలు, పాదయాత్రలతో రాహుల్ గాంధీ హోరెత్తించనున్నారు. కాంగ్రెస్ పార్టీకి విజయ అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో రాహుల్ గాంధీ పర్యటన ప్రత్యర్థి పార్టీలకు టెన్షన్ పుట్టిస్తుంది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో రేపు రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో అందరిలో ఆసక్తి నెలకొంది. ఇక రాహుల్ గాంధీ పర్యటన వివరాల్లోకి వెళితే నవంబర్ 17వ తేదీన ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రాహుల్ గాంధీ చేరుకుంటారు. శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుంచి హెలికాప్టర్లో ఉదయం 11 గంటలకు పినపాక చేరుకుంటారు. రెండు గంటలకు పినపాక లో రోడ్ షో, కార్నర్ మీటింగ్ ను నిర్వహిస్తారు. ఆ తర్వాత పినపాక నుంచి నర్సంపేటకు చేరుకుంటారు రాహుల్ గాంధీ. మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు నర్సంపేటలో రాహుల్ గాంధీ రోడ్ షోలో పాల్గొంటారు. రోడ్డు మార్గంలో రాహుల్ గాంధీ వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చేరుకుంటారు. నాలుగు గంటలకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేయనున్నారు. తూర్పు నుంచి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం వెళ్లనున్న రాహుల్ గాంధీ పశ్చిమ నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొంటారు. ఆరున్నర గంటలకు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ రాజేంద్రనగర్ రాహుల్ గాంధీ చేరుకుంటారు. రాజేంద్రనగర్లో సమావేశం తర్వాత ఢిల్లీకి రాహుల్ గాంధీ తిరుగు ప్రయాణమవుతారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రేపు వరంగల్ జిల్లాలో పర్యటన నేపథ్యంలో సర్వత్రా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, నర్సంపేట నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడంతో అక్కడ రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తుంది.

నర్సంపేటలో దొంతి మాధవరెడ్డి తరఫున రోడ్ షోలో పాల్గొని ప్రచారం నిర్వహించనున్న రాహుల్ గాంధీ, అనంతరం వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చేరుకొని, కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖను గెలిపించాలని కోరుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు పాదయాత్ర చేస్తారు. అక్కడ నిర్వహించే కార్నర్ మీటింగ్ లో పాల్గొంటారు.

అనంతరం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించే రోడ్ షోలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి తరఫున ప్రచారాన్ని నిర్వహించనున్నారు. ఆపై రాజేంద్ర నగర్ వెళ్లనున్నారు.

**మణుగూరులో రాహుల్ రోడ్‌షోకు భారీ ఏర్పాట్లు :** అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శుక్రవారం మణుగూరుకు రానున్నారు. సీపీఐ బలపర్చిన పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన రోడ్‌షో, స్ట్రీట్ మీటింగ్‌ల్లో పాల్గొనబోతున్నారు.

ఈ మేరకు మణుగూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర నేత బీ అయోధ్య, డీసీసీబీ డైరక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య విలేకరుల సమావేశాన్ని నిర్వహించి రాహుల్ పర్యటన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడు తూ పినపాకతో పాటు ఉమ్మడిజిల్లాల్లో కాంగ్రెస్ విజయం కోసం రా హుల్ ప్రచారం చేయబోతున్నారని, శుక్రవారం ఉదయం 10గంటలకు మణుగూరులో రోడ్ షో, ఆ తర్వాత స్ట్రీట్‌మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తొలిసారి ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న రాహుల్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సీఎం కేసీఆర్ పాలనలో ఊరంతా ఆదర్శ రైతులే : మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్ : కాంగ్రెస్ హయాంలో గ్రామానికో ఒకరిద్దరు ఆదర్శ రైతులుండేవారని.. కేసీఆర్ పాలనలో ఊరంతా ఆదర్శ రైతులేనని మంత్రి హరీశ్‌రావు అన్నారు. జహీరాబాద్ హద్నురులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ కర్నాటకలో ఐదు గ్యారెంటీలు ఇచ్చి ఐదునెలలైందని.. ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఐదుగంటలే కరెంటు వస్తుందని.. సెల్‌ఫోన్ ఛార్జింగ్ కూడా పెట్టుకోలేక జనం ఇబ్బందులుపడుతున్నారని ఆరోపించారు. కటక వేస్తే వచ్చే కరెంట్ కావాలో.. కటిక చీకట్ల కాంగ్రెస్ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. కర్ణాటకలో పెన్షన్ రూ.600 ఇస్తున్నారని.. కల్యాణలక్ష్మి అక్కడ అమలులో లేదన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ హామీలు అమలు చేయడం లేదని.. గెలవని తెలంగాణలో హామీలు ఇస్తున్నారని విమర్శించారు. ఎకరాకు రూ.16వేల రైతుబంధును గెలిచాక ఇవ్వబోతున్నామన్నారు. కాంగ్రెస్‌కు ఓటేయొద్దని కర్ణాటక ప్రజలు లబోదిబోమంటున్నారన్నారు. బీజేపీ ఉండగా.. ఏడు గంటలు ఉండగా.. కాంగ్రెస్ ఐదుగంటల కరెంటు ఇస్తుందన్న ఆయన.. రైతుల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారిందన్నారు. ఐదుగంటల కరెంటు కావాలంటే కాంగ్రెస్‌కు ఓటువేయాలని.. 24 గంటలు కావాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలన్నారు. ఎన్నికల్లో గెలవగానే సన్నబియ్యం ఇవ్వబోతున్నామని.. జనవరి నెల నుంచి అసైన్డ్ భూములకు పట్టా ఇచ్చి హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఆరోగ్య శ్రీని 15లక్షలకు పెంచబోతున్నామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద నెలకు రూ.3వేలు ఇవ్వబోతున్నట్లు తెలిపారు.



జహీరాబాద్‌కు కాంగ్రెస్ పాపంగా మారిందని.. 12సార్లు గెలిచినా చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నేనురాను బిడ్డో సర్కారు దవాఖానకు అంటే.. నేడు పోదాం పద సర్కారు దవాఖానకు అంటున్నారన్నారు. డయాలసిస్ సేవలు, ఐసీయూ వార్డులు ప్రభుత్వ దవాఖానాల్లో తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందన్నారు.

ఎన్నికల కమిషన్ అనుమతి రాగానే అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



## ఎమ్మెల్సీ కవిత కాన్వాయ్‌ని తనిఖీ చేసిన పోలీసులు

నిజామాబాద్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాన్వాయ్‌ని పోలీసులు గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ నుంచి కోరుట్లకు ప్రయాణిస్తున్న కవిత వాహనాన్ని ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీసులకు ఎమ్మెల్సీ కవిత పూర్తిగా సహకరించారు. ఆమె వాహనంతో పాటు తన వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు చెక్ చేశారు. తనిఖీకి సహకరించిన ఎమ్మెల్సీకి పోలీసులు ధన్యవాదాలు తెలిపారు.




# కాంగ్రెస్‌ను నమ్మితే..

## మంది మాట పట్టుకొని మార్మానం పోయినట్టే..!

## ధరణిని తీసేస్తే మళ్ళీ అయ్యే తిప్పలు

## ఆదిలాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

ఆదిలాబాద్ : మంది మాట పట్టుకొని మార్మానం పోతే.. మళ్లచ్చే వరకు ఇల్లు గాలిపోయిందని పెద్దలు చెప్పారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే పరిస్థితి అట్లనే ఉంటదని సీఎం అన్నారు. ఆదిలాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలు సీఎం కేసీఆర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. 'మూడు సంవత్సరాలు కష్టపడి ధరణిని తీసుకువచ్చాం. బాధ్యత లేకుండా దాన్ని తీసివేస్తమంటున్నరు. మళ్లీ ఒగలభూమి ఒకరు గుంజుకోవాలి.. తాకులాటలు పెట్టాలె.. జుట్లు ముడేయాలి. మళ్లీ కోర్టులు, వకీళ్లు, ఆఫీసుల చుట్టూ తిరగాలే. మళ్లీ వీఆర్వోలు వస్తరు. అన్నా నీకు ఎన్ని ఎకరాలు ఉన్నయ్. రైతుబంధు ఎంత వస్తది ? సంవత్సరానికి లక్ష వస్తదంటే నాకు రూ.40వేలు ఇవ్వాలంటాడు. ఇవాళ ఆ ఆఫీసుకు వెళ్లకుండా ధరణితో మీ అకౌంట్లో డబ్బులు వచ్చిపడుతున్నయ్. ఈ దుర్మార్గులు వచ్చి ధరణిని తీసివేస్తే మళ్లీ మొదటికిపోది. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్లయితది. మంది మాట పట్టుకొని మార్మానం పోతే.. మళ్లచ్చే వరకు ఇల్లు గాలిపోయిందని పెద్దలు చెప్పారు' అన్నారు.

**మూడు గంటల కరెంటు సరిపోతదా..? :** పీసీసీ అధ్యక్షుడు ఇంకోటి చెబుతున్నడు. మూడు గంటల కరెంటు సరిపోతుందట. మరి మూడుగంటల కరెంటు సరిపోతదా? 24 గంటల కరెంటు కావాలంటే బీఆర్ఎస్ రావాలి. మూడు గంటలకే పొలం పారుతుంది.. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలట? మరి టెన్ హెచ్‌పీ ఎవడు కొనివ్వాలే. మరి వీని అయ్యకొనిస్తడా? రైతుల దాకా టెన్ హెచ్‌పీ ఉంటదా? తెలంగాణలో ఒకటి కాదు రెండు కాదు 30లక్షల పంపుసెట్లు ఉన్నయ్. ఏందీ ఈ మాటలు. పెద్ద ప్రమాదం ఉన్నది. మేం బాజాప్త చెప్పినం. అయినా మాకే ఓటు వేశారు.. తీసి అవతల పడేస్తమ్ అంటరు అప్పుడు నేను కూడా ఏం చేయలేను. అందుకే ఆలోచించాలి. 15 ఏళ్లు కాంగ్రెస్ తిప్పలు పెడితే చచ్చుడో బతుకుడో అని దీక్షపట్టి సావునోట్లో తలకాయపెట్టి తెలంగాణ తీసుకువచ్చాను. తెచ్చిన తెలంగాణను పేదనుసాదను.. చిన్నాపెద్ద అందరినీ కలుపుకొని కుల, మతాలు లేకుండా మంచిగా తెలంగానను ఒక దరికి తెస్తున్నాం' అన్నారు.

**తెలంగాణ మళ్లీ నాశనం కావొద్దనే బాధ..** 'ఈ తెలంగాణ మళ్లీ నాశనం కావొద్దన్నదే నా బాధ. మళ్లీ దుర్మార్గులు వచ్చి ధరణిని తీసివేస్తం.. మళ్లీ పట్వారీలను పెడుతాం.. మళ్లీ దళారీలు.. దోపిడీలు స్టార్ట్ చేస్తాం.. భూములు కబ్జాలు పెడతం.. ఇదేనా కావాల్సింది? బీఆర్ఎస్ కావాలో ఆలోచించాలి. ఈ విషయాలపై గ్రామాలకు వెళ్లిన తర్వాత జనాలను పోగేసి చర్చ పెట్టాలి. కరెంటు కావాల్నా ? కాంగ్రెస్ కావాల్నా?.. రైతుబంధు కావాల్నా ? రాబంధు కావాల్నా ? ఏది కావాలో నిర్ణయం చేయాలి' అని సీఎం కేసీఆర్ కోరారు.

**గిరిజనేతరులకూ పట్టాలు ఇస్తాం..** ప్రజలు మంచి.. చెడు ఆలోచించి ఓటు వేస్తే రాష్ట్రానికి మంచి జరిగేందుకు అవకాశం ఉంటుందని కేసీఆర్ అన్నారు. బోథ్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. "గతంలో మంచినీళ్ల కోసం ఎంతో బాధపడ్డాం. అందుకే ఆలోచించి మిషన్ భగీరథను తీసుకొచ్చాం. అదే కాంగ్రెస్ హయాంలో చూస్తే ప్రతి విషయంలోనూ ప్రజలు బాధలే అనుభవించారు.

భారాస చేసిన అభివృద్ధిని కార్యకర్తలు.. ప్రజలకు వివరించాలి. బోథ్ ప్రజలు మూడు కోరికలు కోరుతున్నారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తాం. డిగ్రీ కళాశాల మంజూరు చేస్తాం. ఈ ప్రాంతంలో కూరగాయలు ఎక్కువగా పండిస్తారు. ఇందుకోసం కోల్డ్ స్టోరేజీ మంజూరు చేస్తాం. గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇచ్చాం. గిరిజనేతరులకు కూడా వచ్చే దఫాలో పట్టాలు ఇస్తాం. ఎన్నికల్లో ప్రజలు గెలవాలి" అని కేసీఆర్ తెలిపారు.

# సంపాదకీయం

## ప్రచారం ఫ్లస్సే.. కానీ జేబులు గుల్లవుతున్నాయే బీఆర్ఎస్ టాక్!

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు లబోదిబో మంటున్నారు. నిన్న మొన్నటి వరకు టికెట్లు రాలేదని.. గగ్గోలు పెట్టిన నాయకులు.. ఇప్పుడు టికెట్ వచ్చినా ముఖంలో సంతోషం కనిపించడంలేదు. ఇది నిజ్జంగా నిజం! ఎందుకంటే.. పోరు ఆ రేంజ్‌లో ఉంది. ఒకవైపు సర్వే సంస్థలు ఏ పార్టీకీ మెజారిటీ కట్టబెట్టడం లేదు. పోరు ఏకపక్ష మని తేల్చలడం లేదు. ప్రజల నాడి అటు ఇటుగా ఉందని తేల్చేస్తున్నా యి. దీంతో నాయకుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. క్షణం తీరికలేకుండా.. చెమటోడిస్తే తప్ప.. గెలుపు గుర్రం ఎక్కడం కష్టమని బీఆర్ ఎస్ నాయకులు భావిస్తున్నారు. దీనికితోడు స్టార్ క్యాంపెయినర్‌గా సీఎం కేసీఆర్ అన్ని బాధ్యతలను భుజాన వేసుకున్నారు. దీంతో ఆయన రోజుకు రెండు మూడు జిల్లాలు... నాలుగైదు నియోజకవర్గాలు లక్ష్యంగా పెట్టుకుని సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. ఇది ఒకరకంగా.. బీఆర్ ఎస్ టికెట్ తీసుకున్నవారికి నెత్తిన పాలు పోస్తోంది. కేసీఆర్ వ్యాఖ్యలు, దూకుడు ప్రసంగాలు వారికి మేలు చేస్తాయని భావిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇక్కడే అసలు సమస్య వారిని ముంచేస్తోంది. కేసీఆర్ సభ పెట్టారంటే.. హీనపక్షం రెండు మూడు లక్షల మంది ప్రజలను తరలించాలి. భారీ గ్రౌండ్‌ను అద్దెకు తీసుకోవాలి. అక్కడ వందల వేల సంఖ్యలో బీఆర్ ఎస్ జెండాలను ఏర్పాటు చేయాలి. మైకు నుంచి మంచినీళ్ల వరకు, కుర్చీల నుంచి వచ్చిన వారికి ఏర్పాట్ల వరకు అన్నీ అభ్యర్థులే ఏర్పాటు చేసుకోవాలి. పార్టీ కొంత ఇస్తామని చెబుతున్నా.. అభ్యర్థులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. ముఖ్యంగా ఒక్కొక్క సభ నిర్వహణకు కోటిన్నర నుంచి 2 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నారని సమాచారం. పైగా.. కేసీఆర్ వస్తున్నా రంటే.. ముందుగానే రెండు కిలో మీటర్ల దూరం నుంచి ప్రచారం ప్రారంభించాలి. అదేసమయంలో పత్రికలకు, స్థానిక మీడియాకు ప్రకటనలు ఇవ్వాలి. ఇదేమీ ఊరికేనే రావడం లేదు. ఇక, తమకు అనుకూలంగా వ్యవహరించే మీడియాను బతిమాలుకునైనా నిరీక్షించేలా చేయాలి. ఇవన్నీ కూడా అభ్యర్థులకు తలకు మించిన భారంగా మారిందనే వాదన బీఆర్ ఎస్‌లో వినిపిస్తోంది. ఈ ఖర్చును భరించలేని పరిస్థితిలో ఉన్నా.. కేసీఆర్ ప్రచారంతో తమకు మేలు జరిగితే.. తర్వాత ఎలాగో లో భర్తీ చేసుకోవచ్చన్న ధ్యాసతో అభ్యర్థులు సాహసాలు చేస్తుండడం గమనార్హం.

# ప్రజలు బిజెపికే మద్దతు ఇస్తారు...

**దేశం కోసం, ధర్మం కోసం పని చేసే పార్టీ బిజెపి**

**మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి**



శామీర్ పేట (గరుడ వార్త) : దేశం కోసం ధర్మం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని మేడ్చల్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. మూఢుచింతలపల్లి మండలంలోని జగన్ గూడ, కేశవరం, నాగిశెట్టి పల్లి, ఆద్రాస్ పల్లి, ఉద్దేమర్రి, కేశ్వాపూర్ గ్రామాలలో గురువారం మూఢుచింతలపల్లి మండల బిజెపి కమిటీ ఆధ్వర్యంలో బిజెపి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జోకర్ మల్లారెడ్డి ఎమ్మెల్యే గా గెలిచి, మంత్రి పదవి దకించుకొని అభివృద్ధి చేసింది ఏమి లేదని, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎన్నికల హామీలను విస్మరించారని విమర్శించారు. మేడ్చల్ అభివృద్ధికి సంబంధించిన నిధులు వేరే నియోజకవర్గానికి దగ్గరకి తరలించినా అడిగే దమ్ములేని అసమర్థుడు మల్లారెడ్డి అని అన్నారు. అంతేగాక నియోజకవర్గంలో వంద పడకల ప్రభుత్వ దవాఖాన ఒక్కటి కూడా తీసుకురాలేదని వాటర్ సమస్యలు, వాక్ బోర్డ్ సమస్యలు అధికంగా ఉన్నాయని ఆయన అవగాహన లేమితో మేడ్చల్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని పేర్కొన్నారు. కరోన సమయంలో టీకా ఉచితంగా ఇచ్చిన ఘనత ప్రధాని మోదీదని బిజెపి కి ఓటేసి తనను ఎమ్మెల్యే గా గెలిపిస్తే మేడ్చల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. అయితే బి ఆర్ ఎస్ నాయకులే మల్లారెడ్డి మాకొద్దని ఆయన కబ్జాలతో పార్టీ పేరు పాడు చేశారని ఆయనకు టికెట్టు ఇవ్వొద్దని అధిష్టానానికి చెప్పినా ఆయనకే టికెట్ ఇవ్వడం శోచనీయమని అన్నారు. బీజేపీ అధికారములోకి వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. ఉచితంగా విద్యా, వైద్యం అందిస్తామని ప్రతిఒక్కరిని అదుకోవాలన్నదే మోడీ ధ్యేయమని బిజెపి కి ఓటేసి తనను గెలిపియాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింహ, బుద్ధి శ్రీనివాస్, ఎంసీ పల్లి మండల కమిటి అధ్యక్షులు నందాల శ్రీనివాస్, ఎస్టీ మోర్చా నాయకులు సుధాకర్ నాయక్, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు విజయ లక్ష్మీ, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి రాజా రమేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు , మహేష్, లక్ష్మీ నారాయణ, మండల మహిళ అధ్యక్షురాలు విజయ లక్ష్మి, వెంకటేష్ నాయక్, అంకుషా పూర్ సర్పంచ్ కావేరి మచ్చందర్ రెడ్డి, కిసాన్ సెల్ ప్రభాకర్ రెడ్డి, నాగరాజు చారి, నరేందర్ రెడ్డి, రతన్, అరుణ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియతో జిల్లాలో ఎన్నికల సిబ్బంది

**ర్యాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్, అమన్ మిట్టల్ , జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.**



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : జిల్లాకు సంబంధించి ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సంబంధించిన సిబ్బందిని రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్ జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్, అమన్ మిట్టల్ , జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్పల్లి, ఉప్పల్ శాసనసభ నియోజక వర్గాలకు సంబంధించి మొత్తం 2439 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 12510, మందిని రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. అందులో 2880 మంది పీవోలు, 2860 మంది ఏపీవో లు, 6570 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. ప్రతి టీమ్లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు అదర్ పోలింగ్ ఆఫీసర్లు ఉంటారన్నారు. రిజర్వ్ టీమ్ లకు శిక్షణ ఇచ్చి, హెూమ్ ఓటింగ్ కు ఉపయోగించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లాకు సంబంధించి మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టి... అవసరమైన 200 మంది మైక్రో అబ్జర్వర్ల ఎంపిక పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో , జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులతో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్లోని ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను పరిశీలించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్, పోలీస్ అబ్జర్వర్ నేహా యాదవ్...



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: జిల్లాలో శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఈ విషయంలో ఎంసీఎంసీ మీడియా సెంటర్లో ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరంఉందని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్ (మేడ్చల్), పూర్వాగార్గ్ (ఉప్పల్, మల్కాజిగిరి), జిల్లా పోలీసు అబ్జర్వర్ నేహాయాదవ్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్కు వచ్చిన వారు కలెక్టరేట్లో ఏర్పాటు జిల్లా గ్రీవెన్స్ కమిటీకి సంబంధించి పూర్తి వివరాలను కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తిని అడిగి తెలుసుకొన్నారు.

గ్రీవెన్స్ కమిటీకి సంబంధించి సీజ్ చేసిన నగదు, తదితరాలు ఎంత మేరకు తిరిగి ఇచ్చారనే వివరాలను పూర్తిగా అడిగి తెలుసుకొన్నారు, స్టాటిక్ సర్వే లెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాల లైవ్ స్ట్రీమింగ్ను పరిశీలించి కంట్రోల్ రూమ్ పనితీరును అడిగి తెలుసుకొని పలు సలహాలు, సూచనలు చేశారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల లో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు, ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు డీఏవీపీ, డీఐపిఆర్ రేట్లు, ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, సోషల్ మీడియా, ఫేక్ న్యూస్, పెయిడ్ న్యూస్ వివరాలను అడిగి తెలుసుకొన్నారు అలాగే సామాజిక మాధ్యమాలలో జరిగే ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సోషల్ మీడియా సెల్ యాక్టివ్గా పని చేస్తుందని ఇదే విధంగా ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తయ్యే వరకు కొనసాగించాలని ఎలక్ట్రానిక్ మీడియా, లోకల్ కేబుల్ ఛానళ్ళలో వచ్చే ఆయా రాజకీయ ప్రకటనలు, రాజకీయ ప్రచారాల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డ్ చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వా గార్గ్, జిల్లా పోలీస్ అబ్జర్వర్ నేహాయాదవ్ పేర్కొన్నారు.

# ఏడాది గడిచినా.. ఏదీ అవగాహన..?

మంచిర్యాల : అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా, సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వ సాయం పొందేలా దేశవ్యాప్తంగా గతేడాది ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌కు ఉమ్మడిజిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. దీని ప్రయోజనాలపై కార్మికులకు అవగాహన కల్పించడం కరవైంది. నాలుగుజిల్లాల్లో ఇదే పరిస్థితి. కార్మికులు సైతం ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. ఈ-శ్రమ్ అందుబాటులోకి వచ్చి ఏడాది అవుతున్నా అర్హులు సగం కూడా చేరలేదు. అసంఘటితరంగ కార్మికులందరిని కార్మికశాఖ గుర్తించినా వారిని ఇందులో చేర్చడంలో మాత్రం వెనుకబడిపోయింది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికి కనీసం 50శాతం కూడా పూర్తికాలేదు.

ఈ-శ్రమ్ కార్డుదారులకు ప్రభుత్వం ప్రమాదబీమా దాదాపు రూ. 2లక్షలు ఇవ్వనుంది. గాయపడి వికలాంగులుగా మారినా సుమారు రూ.లక్ష అందించనుంది. సాధారణ మృతి, కార్మికుల కుటుంబసభ్యులు వివాహం, చదువు కోసం ఆర్థికసాయం సైతం పొందేందుకు అర్హత ఉంటుంది.



వయసు 16-59 సంవత్సరాలు ఉన్న వ్యక్తులు పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపుపన్ను చెల్లించనివారు ఈ కార్డు పొందేందుకు అర్హులు.

అడ్డా కూలీ దగ్గర నుంచి షాపింగ్‌మాల్, హెూటల్స్, పేయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, చేనేత కార్మికులు, వడ్రంగులు తదితర దాదాపు 54 రకాల రంగాలకు చెందిన కార్మికులు ఈ కార్డు పొందవచ్చు.

ఈ-పోర్టల్‌లో నమోదుకు కావాల్సిన పత్రాలు.. ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో చేసుకోవచ్చు. సొంతంగా చేసుకోవడం ఇబ్బందిగా ఉంటే కామన్ సర్వీస్ సెంటర్‌లలో ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకెళ్లి నమోదును ఉచితంగా చేయించుకోవచ్చు.

మొబైల్ సదుపాయం లేనివారు సైతం వేలిముద్ర, ఐరిస్ సాయంతో నమోదు చేసుకోవచ్చు.

ఆదిలాబాద్‌జిల్లాను మినహాయిస్తే మిగతా ఏ జిల్లాలోనూ సగం కూడా పూర్తికాలేదు. మంచిర్యాల 50శాతానికి చేరువ కాగా నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్‌జిల్లాలు మరీ అధ్వానంగా ఉన్నాయి. సగానికే చాలా దూరంలో ఉన్నాయి.

**అవగాహన లేకపోవడంతోనే..**

అసంఘటితరంగ కార్మికులు లక్షల్లో ఉన్నా ఈ కార్డు పొందినవారు చాలా తక్కువ మంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. నిరక్షరాస్యతతో పాటు ఉపయోగాలపై అవగాహన లేకపోవడం కారణం. కార్మికశాఖ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సంబంధిత అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. యజమానులు సైతం దీని ప్రయోజనాలను తెలియజేసి, నమోదు చేసేందుకు ముందుకురావాలి.

**ఈ-శ్రమ్‌లో నమోదు సగమే..**

ఇటీవల మంచిర్యాలలోని వ్యాపార సంఘం నాయకులు ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నారు స్వచ్ఛందంగా ముందుకురావాలిఎ.ఎస్.వినిత, ఏసీఎల్, మంచిర్యాల చాలామంది కార్మికుల బ్యాంకు ఖాతాలు ఆధార్ సంఖ్యతో అనుసంధానం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరిని ఈ-శ్రమ్‌లో నమోదు చేయడం కష్టంగా మారింది. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, కార్మికులకు ఈ-శ్రమ్‌పై వివరిస్తున్నా ముందుకురావడంలేదు. కార్మికశాఖతో పాటు వీరు సైతం ఆసక్తి చూపిస్తేనే విజయవంతానికి అవకాశం ఉంటుంది.

## శిథిల భవనం..బడికెళ్లాలంటే భయం

నిర్మల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల అనంతరం సర్కారు బడుల పరిస్థితులు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించి, శిథిలావస్థకు చేరుకున్న, ఊరుస్తున్న తరగతి గదుల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. భారీ వర్షాలు, వరదలతో విద్యాలయాలకు వారం రోజులు సెలవులు ఇవ్వగా సోమవారం పునః ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు' జిల్లాలోని పాఠశాలలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. పలుచోట్ల ప్రమాదకర స్థితిలో విద్యాబోధన చేస్తున్న విషయం వెల్లడైంది.జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి 735 బడుల్లో 47,384 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పలు చోట్ల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్లక్రితం నిర్మించినవి కావడంతో పైకప్పులు దెబ్బతిని గోడలు తడిగా మారి పెచ్చులూడి, ఊరుస్తున్నాయి. వర్షపు నీరు నిల్వఉండటంతో విద్యాభ్యాసం చేసేందుకు పిల్లలు పలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. మన ఊరు-మనబడి, మన బస్తీలో మొదటి విడతగా 260 ఎంపిక చేయగా, ఇందులో 172 చోట్ల రూ. 30 లక్షల్లోపు ఉండడంతో ఇందులో నుంచి 90 బడుల్లో మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. వర్షాలకు అవి కూడా జరగడం లేదు. కొన్ని చోట్ల నిధులు లేక పనులు చేయడం లేదు.

ఇంకా కొన్ని చోట్లలో.. దిలావర్‌పూర్ మండలం లోలం, లోకేశ్వరం మండలం రాయపూర్‌కాండ్లి, హథ్‌గాం, ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పురాతనమైనవి కావడంతో ఊరుస్తున్నాయి.

భైంసా మండలం కుంసర, తానూరు మండలం ఉమ్రి(కె) ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో చోట రెండు గదులు మాత్రమే ఉన్నాయి. పైకప్పు ఉరవడం, గదుల్లో నీళు నిల్వడం వంటి సమస్యలతో వరండాల్లో నిర్వహిస్తున్నారు.

నిర్మల్ మండలం అనంతపేట్ ఉన్నత పాఠశాలలో పైకప్పు దెబ్బతింది. దీంతో 9, 10 తరగతులు ఒకే గదిలో నిర్వహిస్తున్నారు.

ముథోల్: బాసర మండలం సోలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి పెద్ద మొత్తంలో నీళ్లు నిలిచాయి. ఉన్న రెండు గదులు, వరండా పూర్తిగా జలమయం కావడంతో గ్రామస్థులు వచ్చి వాటిని తోడేశారు. విద్యార్థులను గ్రామపంచాయతీలో కూర్చోబెట్టి బోధన చేశారు. ముథోల్ బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 190 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇక్కడ మూడు గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో వరండాల్లో బోధించాల్సి వస్తోంది. భవనం శిథిలావస్థకు చేరుకుంది.

పై కప్పు మట్టి పడడం, ఊరుస్తుండడంతో కట్టిన ప్లాస్టిక్ కవర్

- నిర్మల్ మండలం వెంగ్వాపేట్‌లో 1976లో నిర్మించిన ప్రాథమిక పాఠశాలలో 132 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయిదు ఇరుకు గదుల్లో నుంచి ఒక దానిని స్టాఫ్ రూంగా, మిగతా వాటిని తరగతులకు వినియోగిస్తున్నారు. వీటికంటే ముందే నిర్మించిన మరో రెండు గదులున్నా అవి ప్రమాదకరంగా మారింది, మరో గది పనికిరాకుండా ఉన్నాయి. తల్లిదండ్రులు, పోషకులు, గ్రామస్థుల సహకారంతో ఏడేళ్లుగా ఇక్కడ ఆంగ్ల మాధ్యమ బోధన జరుగుతోంది. అయితే వసతులు లేవు.తరగతి గదిలో సాధారణంగా విద్యార్థులు నేలపై, బల్లలపై కూర్చొని చదువు కోవడం అందరికీ తెలిసిన విషయమే. కానీ ఈ పాఠశాలలలోని విద్యార్థుల పరిస్థితి అందుకు భిన్నం. పగలంతా వారు నిలబడే పాఠాలు వినాల్సిన దయనీయస్థితి. సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల దుస్థితి చూస్తే పాపం అనని వారుండరు. 83 మంది విద్యార్థులున్న విద్యాలయంలో అయిదుగురు ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు.

# ఎన్నికల హెూరు.. పెళ్లిళ్ల జోరు

నాంపల్లి : ఎన్నికల వేళ వివాహాల జోరు ఆయా రాజకీయ పార్టీలను కలవరపెడుతున్నాయి. ఈసారి శ్రావణమాసంలో ఆశించిన మేర ముహూర్తాలు లేవు. నవంబరు నెలలో కార్తిక మాసంలో ఎనిమిది రోజుల పాటు మంచి రోజులు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు ఈ నెల 16 నుంచి 29వ తేదీ మధ్యన ఎక్కువగా పెళ్లిళ్లు జరగనున్నాయి. నవంబరు 30న పోలింగ్ జరగనుండగా.. దానికి ముందు వారం రోజుల పాటు వివాహ వేడుకలు ప్రారంభం కానున్నాయి. పోటీ చేసే అభ్యర్థుల ప్రచారం, వివాహాల సందడి ఒకేసారి జరగనుండటంతో ఆయా పార్టీల నాయకులు అంతర్మథనం చెందుతున్నారు.

పిలవని పేరంటమైనా వెళ్లాల్సిందే...

గతంలో వివాహానికి హాజరుకావాలని ఆహ్వానం పంపినా ప్రజా ప్రతినిధులు వచ్చేవారు కాదు. ఎన్నికల పుణ్యమా అని ఈ సారి ప్రతి



పెళ్లికి పిలవకున్నా అభ్యర్థులు వెళ్లక తప్పేలా లేదని కిందిస్థాయి నాయకులు పేర్కొంటున్నారు. ప్రతి ఓటును విలువైనదిగా భావించే అభ్యర్థులు వెళ్లలేకపోయినా తమ తరఫు నాయకులను పంపేందుకు ఆలోచన చేస్తున్నారు. ఆహ్వానం వచ్చినా, రాకపోయినా ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యమిస్తూ వివాహ వేడుకలను తమకు అనుకూలంగా మలచుకోవాలని భావిస్తున్నారు. ఈ నెల 16, 19, 21, 22, 23, 24, 26, 29 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 4 వేల పెళ్లిళ్ల వరకు జరిగే అవకాశం ఉందని పురోహితులు చెబుతుండగా.. పెళ్లి సందడిలో పడి ఓటు వేయడం మరిచిపోవద్దని అధికారులు పేర్కొంటున్నారు.

# శతశాతం ఓటింగ్‌కు పరిశ్రమ

చేర్యాల : శతశాతం పోలింగ్ లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారయంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. వివిధ కార్యక్రమాలతో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. ఇదే క్రమంలో కార్మికులపై ప్రత్యేక దృష్టిసారించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పరిశ్రమల్లో పని చేసే వారంతా ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. ప్రధానంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని కర్మాగారాల్లో అనేక చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వీటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని సైతం నియమించారు.

పటాన్‌చెరు, జిన్నారంలలో పారిశ్రామిక వాడలు వెలిశాయి. దేశం, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది ఇక్కడే ఉంటూ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. మరోవైపు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం ఇక్కడ నివాసం ఏర్పరుచుకున్నారు. వీరంతా గత ఎన్నికల్లో ఓటేయడానికి అంతగా ఆసక్తి చూపలేదు. దీన్ని గమనించిన ఎన్నికల సంఘం అధికారులు అందరూ ఓటేసేలా చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టార. ఇప్పటికే పరిశ్రమల్లో మొదలయ్యాయి. 2018లో ఈ నియోజకవర్గంలో 70 శాతం మాత్రమే పోలింగ్ జరగడం గమనార్హం.

10,300 మంది అధికారులు ఇంటింటికి తిరిగి కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునేలా కృషి చేశారు. వీరి ప్రయత్నాలు ఫలించాయి. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు ఎలా పొందాలో వివరించారు. వారితో దగ్గరుండి మరి ఓటరుగా నమోదు చేయించారు. ఐడీఏ బొల్లారం, పటాన్‌చెరు తదితర పారిశ్రామిక వాడల్లో 10,300 మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. నియోజకవర్గంలో 2,05,545 మంది ఓటర్లు ఉన్నారు.

నిష్పక్షపాతంగా..ఓటర్లను ఆకట్టుకునేందుకు నాయకులు ప్రయత్నిస్తుంటారు. ప్రలోభాలకు లొంగకుండా సమర్థ నేతలకు పట్టం కట్టేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రలోభాలకు తావివ్వకూడదని, ఇస్తే భవిష్యత్తులో వచ్చే సమస్యలను వివరిస్తున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు నచ్చకుంటే నోటాను వాడుకోవాలని సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తూ..పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు



మంజూరు చేస్తారు. ఉత్పత్తులు నిలుపుదల సాధ్యం కాని కర్మాగారాల్లో కార్మికులంతా ఓటేసేలా వంతుల వారీగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. అయినా కొందరు అంతగా ఆసక్తి చూపలేదు. ఈ విషయంలో మార్పు తెచ్చేందుకు అధికారులు అవగహన కల్పిస్తున్నారు. కాలనీలు, కూడళ్లలో కళాజాతలు నిర్వహిస్తున్నారు. ప్రతి కూడలిలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటుచేశారు.

అన్నింటినీ వివరిస్తూ.. –నాగేశ్వర్‌రావు, ఏలూరి ఫార్మా పరిశ్రమ ఎండీ

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి కార్మికుడు పోలింగ్‌లో పాల్గొనాలని సూచిస్తున్నాం. కొత్తగా ఓటరు జాబితాలో పేరు కోసం దరఖాస్తు చేయించాం. ఓటు విలువను విరామ సమయంలో ప్రతినిధులు వివరిస్తున్నారు.

అందరికీ సమాచారం– ఆనంద్‌రావు, పారిశ్రామిక యాజమాన్యాల సంఘం కార్యదర్శి

కార్మికుల్లో చైతన్యం తీసుకొచ్చేలా ప్రతి పరిశ్రమ యాజమాన్యానికి సూచిస్తున్నాం. పోలింగ్ రోజు సెలవు కావడంతో అందరూ ఓటేయడంపై దృష్టిసారించాం. ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించాం. సత్ఫలితం ఉంటుంది.

పోలింగ్ శాతం పెంచేలా.. – జ్యోతిరెడ్డి, సహాయ ఎన్నికల అధికారిణి, పటాన్‌చెరు

పోలింగ్ శాతం పెంచేలా చర్యలు చేపట్టాం. పరిశ్రమలు, కూడళ్లు, కళాశాలలు, కాలనీలలో అవగహనా సదస్సులు, కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా కార్యక్రమం కొనసాగుతోంది. గతంతో పోలిస్తే ఈ సారి పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.

# చాయ్... బిర్యానీ!!



జగిత్యాల : ఎన్నికలు వచ్చాయంటే నాయకులు, కార్యకర్తల్లో జోష్ ఉండటం సహజమే.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రచారతీరును మార్చుకుంటూ పార్టీలు, అభ్యర్థులు కదులుతున్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయం ప్రతి ఎన్నికకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పలు వ్యాపారాలపై ఎన్నికలు ప్రభావం చూపుతున్నాయి. ఎన్నికలకు అవసరమైన సామగ్రి, వాహనాలు, వస్త్రాలు, భోజనశాలలు తదితరాలకు మంచి డిమాండ్ ఉంటోంది.

వాహనాలకు భలే డిమాండ్

ఎన్నికలు వచ్చాయంటే రయ్.. రయ్ మంటూ వాహనాలు తిరగడం చూస్తూనే ఉంటాం. ప్రచార రథాలుగా వ్యాన్లు, ఓటర్లను సభలకు తరలించేందుకు బస్సులు, వ్యాన్లు, ర్యాలీల కోసం కార్లు, మోటారు సైకిళ్లు.. ఇలా అందుబాటులోని వాహనాలన్నీ ఎన్నికల వేళ గిర్రున తిరుగుతున్నాయి. చోటా మోటా నాయకులు కూడా తమకు అప్పగించిన పనుల కోసం కారు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. దీంతో అద్దె వాహనాలకు గిరాకీ పెరిగింది. వాహన యజమానులకు, డ్రైవర్లకు సరాసరి నెల పాటు ఉపాధి దొరికింది. మామూలు వేళ కంటే కాస్తంత అద్దె ఎక్కువైనా రాజకీయ నాయకులు కార్లను అద్దెకు తీసుకుంటున్నారు. ఓటర్లను తరలించేందుకు ఆర్టీసీ బస్సులనూ అద్దెకు తీసుకుంటున్నారు. ఎన్నికల వేళ వినియోగించే వాహనాలకు ఇంధనమూ అవసరం కావడంతో పెట్రోలు, డీజిల్ వ్యాపారాలు కూడా పెరిగాయి.

హెూటళ్లలో రద్దీ

ఒక్కో అభ్యర్థి నామినేషన్లకు వేలాదిగా జనాలను తరలిస్తుండటంతో నియోజకవర్గ కేంద్రాల్లోని హెూటళ్లు కిటకిటలాడుతున్నాయి. చాయ్ హెూటళ్లలో గిరాకీ విపరీతంగా ఉంటోంది. గతం కంటే ఎక్కువ మొత్తంలో టీ అమ్ముతున్నామని జగిత్యాలకు చెందిన ఓ వ్యాపారి పేర్కొన్నాడు. నామినేషన్ సహా చిన్నా చితకా సమావేశాలు, పార్టీ సభలు, అధినేతల బహిరంగ సభలకు వేలాదిగా తరలిస్తున్నారు. వీరంతా టీ స్టాళ్ల వద్ద మాటామంతీతో కనిపిస్తున్నారు. ఇక అల్పాహారం సహా భోజనాల కోసం హెూటళ్లు కిటకిటలాడుతున్నాయి. మధ్యాహ్నం కాగానే బిర్యానీలకు గిరాకీ పెరిగింది. నామినేషన్లు వేసిన రోజున భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ కార్యాలయాల్లో సరాసరి 100 మందికి భోజనాలు పెడుతుండటంతో కేటరింగ్ వారికి ఉపాధి దొరుకుతోంది. చికెన్, మటన్ సెంటర్లు కూడా ఎన్నికల వేళ బిజీగా మారిపోయాయి.

బ్యాండ్ బజాయిస్తున్నారు

అభ్యర్థుల ఊరేగింపు, నామపత్రాల దాఖలు, ప్రచార సభలకు జనాల తరలింపు సమయాల్లో బ్యాండ్ మేళాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో వీరికి డిమాండ్ ఎక్కువే ఉంది. ఇటీవల మంత్రులు, బరిలో నిలిచిన అభ్యర్థులు రీల్స్ చేయడంతో బ్యాండ్‌ను ఉపయోగించి నూతన ప్రచార ఒరవడికి తెర లేపారు. దీంతో బ్యాండ్ బృందాలకు డిమాండ్ పెరిగింది. ఇక నాయకుల స్వాగతాలు, కార్యకర్తల ఇంటింటి ప్రచారం, బహిరంగ సభల నేపథ్యంలోనూ బ్యాండ్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

కళాకారులకు జై!

ఎన్నికల ప్రచారంలో కీలకంగా ఉండే ప్రచార సభల్లో ఆకట్టుకునేది కళాకారులే కావడంతో వారికి డిమాండ్ బాగా ఉంది. కళాకారుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారి బాధ్యతలు చూసేందుకు ఇన్‌ఛార్జిలను నియమిస్తున్నారు. దీంతో కళాకారులకు ఉపాధి దొరుకుతోంది. పాటల రచయితలు, నృత్య కళాకారులు ఎన్నికల వేళ సందడి చేస్తున్నారు. ఇక నాయకుల పేరిట పాటలు రూపొందించే స్థానిక డబ్బింగ్ స్టూడియోలు బిజీగా మారాయి. ఆడియో, వీడియోలతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రచార బాధ్యతలు మోసే ఏజెన్సీలకు భారీగా చెల్లిస్తున్నారు.

ఫంక్షన్ హాళ్లు... టెంట్‌హౌజ్‌లు..

ఎన్నికల వేళ ఫంక్షన్ హాళ్లు బిజీగా మారాయి. ఓ వైపు శుభకార్యాలు ఉండగా మరోవైపు ఎన్నికల లొల్లితో ఫంక్షన్ హాళ్లు ఖాళీగా ఉండటం లేదు. సభలు, సమావేశాలకు తోడు ప్రతీ కార్యక్రమం అనంతరం విందులు ఏర్పాటు చేస్తుండటంతో కూలీలు లబ్ధి పొందుతున్నారు. ఎన్నికల హడావుడి ప్రారంభమైన తొలి రోజు నుంచే ఫంక్షన్‌హాళ్లను బుక్ చేసుకోవడం.. రెండు నెలలకు గుత్తాగా మాట్లాడుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు జరిగినప్పుడు డీజేలు, టెంట్ సామగ్రికి గిరాకీ పెరిగింది. కుర్చీలు సహా ఇతర సామగ్రిని తరలిస్తూ టెంట్ హౌజ్ నిర్వాహకులు ఉపాధి పొందుతున్నారు.

పూలు అధరహెూ...నాయకులు వచ్చారంటే పూలు చల్లడం నుంచి మాలలు వేసేవరకు కార్యకర్తలు హుషారుగా చేస్తున్నారు. వీటికి తోడు పూలబొకేలు ఇస్తుండటంతో పూలకు డిమాండ్ పెరిగింది. ఇటీవలే దసరా, బతుకమ్మ పండగల నేపథ్యంలో పూలకు డిమాండ్ బాగా పెరగగా.. ప్రస్తుతం రూ.50 నుంచి రూ.150 వరకు ధరలు పెంచి అమ్ముతున్నా పూలకు గిరాకీ బాగానే ఉంది. దీంతో పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ పూల వ్యాపారం పెరిగింది. ఇక శాలువాలు, బాణసంచాకు కూడా గిరాకీ వస్తోందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

# ఆర్టీసీ డిపోకు అవార్డుల పంట



వేములవాడ : వేములవాడ ఆర్టీసీ డిపో ఉత్తమ అవార్డులు సొంతం చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది. ఆదాయంలో, టైర్ల మైలేజీలోనూ రాష్ట్ర స్థాయిలో అవార్డులు సొంతం చేసుకొంది. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్‌లో పరిశుభ్రత, పచ్చదనంతోపాటు ప్లాట్ ఫారాల శుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రయాణికులకు సౌకర్యాల కల్పనకు వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ కరీంనగర్ రీజియన్‌లోనే ఉత్తమ బస్టాండ్ అవార్డు పొందింది. ఆర్టీసీ వేములవాడ డిపోలో మొత్తం బస్సులు 36, అద్దె బస్సులు 23 తిరుగుతున్నాయి. వీటితో పాటు వివిధ జిల్లాల డిపో బస్సులు పెద్ద ఎత్తున వేములవాడ బస్టాండ్‌కు వస్తుంటాయి. వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయినప్పటికీ బస్టాండ్‌లో పరిశుభ్రతలో ఎలాంటి లోటు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వడంతో బస్టాండ్ ఆవరణలోని గార్డెన్, చెట్లు ప్రయాణికులకు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ వంటి పట్ల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. బస్టాండ్‌లో ఏదేని సంఘటన జరిగిన వెంటనే గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇలా ప్రతి అంశంలోనూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంతో ఉత్తమ బస్టాండ్ అవార్డు సొంతం చేసుకుంది. ఈ అవార్డుకు రీజియన్‌లోని 11 డిపోల బస్టాండ్లు పోటీ పడగా వేములవాడకు దక్కింది. ఈ నెల 9న డిపో మేనేజరు మురళీ కృష్ణ ఉత్తమ బస్టాండ్ అవార్డుతో పాటు రూ. 5 వేల నగదును అందుకున్నారు. గత నెలలో ఎం.డి. సజ్జనార్ చేతుల మీదుగా ఉత్తమ డిపో మేనేజరుగా కూడా ఆయన అవార్డు పొందారు.

నష్టాలు నుంచి లాభాల బాటలో..

ఏడాది క్రితం భారీగా నష్టాల్లో ఉన్న వేములవాడ డిపో ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తోంది. 2022 ఏప్రిల్ నుంచి 2022 అక్టోబరు వరకు రూ.61 లక్షల వరకు నష్టాల్లో ఉండగా, ప్రస్తుతం లాభాల బాటలో నడుస్తోంది. 2023 అక్టోబరు నాటికి రూ. 3.52 కోట్ల లాభాల్లోకి వచ్చింది. దీంతో పాటు ప్రయాణికులకు బస్ పాసులు ఎక్కువ సంఖ్యలో జారీ చేసి 2023 అక్టోబరు నాటికి రూ. 2.5 కోట్ల ఆదాయాన్ని రాబట్టింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఆయా మార్గాల్లో నడిపించి మంచి ఆదాయాన్ని డిపో సమకూర్చింది. ముఖ్యంగా వేములవాడకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారి అవసరాలకు అనుగుణంగా బస్సులను నడుపుతున్నారు.

టైర్ మైలేజీలోనూ...వేములవాడ డిపోకు టైర్ మైలేజీలోనూ రాష్ట్ర స్థాయిలో అవార్డు వరించింది. ఒక టైర్ 4.8 లక్షల కిలో మీటర్ల మైలేజీతో అవార్డు సొంతం చేసుకుంది. మిగతా డిపోల్లో ఒక టైర్ 3 లక్షల చిల్లర కిలోమీటర్ల మైలేజీ వస్తుంది. వేములవాడ డిపోలోని టైర్ మెకానిక్ రవూఫ్, సహాయ మెకానిక్ కమలాకర్‌ల నైపుణ్యంతో టైర్ మైలేజీ ఎక్కువగా వస్తుంది. దీంతో మెకానిక్ రవూఫ్ ఇటీవల రాష్ట్ర స్థాయి అవార్డుతోపాటు రూ. 50 వేల నగదు పొందారు.

అంకితభావంతో పని చేయడంతోనే..డిపోలో ఉద్యోగులు అందరు అంకితభావంతో పని చేస్తుండటంతోనే డిపోకు లాభాలు వచ్చాయి. అవార్డు దక్కింది. అంతా కష్టపడి డిపోను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తుండటం అభినందనీయం. ఉత్తమ బస్టాండ్ అవార్డుతో పాటు రూ.5 వేల నగదు వచ్చింది. ఈ మొత్తాన్ని బస్టాండ్‌లో ప్రయాణికులకు శుద్ధజలం ఏర్పాటుకు వినియోగిస్తాం. మురళీకృష్ణ, డిపో మేనేజరు, వేములవాడ

## జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

పెద్దపల్లి : జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగింది. ఎన్నికల సంఘం గత నెల 4న ఓటర్ జాబితా విడుదల చేసి, ఆ నెలాఖరు వరకు ఓటర్ నమోదు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులు భారీగా వెలువడగా.. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పించారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో 7,12,359 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 3,54,570 మంది, మహిళా ఓటర్లు 3,57,737 మంది, ఇతర ఓటర్లు 52 మంది నమోదయ్యారు. గత నెల జాబితాలో 6,94,612 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం అదనంగా 17,747 మంది పెరిగారు. శాసనసభ ఎన్నికల్లో ఈ ఓటరు జాబితా ప్రామాణికం కానుంది. సర్వీసు ఓటర్లు 632 మంది..జిల్లాలో రామగుండం, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 7,12,359 మంది ఓటర్లు ఉండగా.. మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో ఈసారి 632 మంది సర్వీసు ఓటర్లు నమోదయ్యారు. వారిలో రామగుండంలో 213 మంది (202 పురుషులు, 11 మహిళలు), మంథనిలో 155 మంది (153 పురుషులు, 2 మహిళలు), పెద్దపల్లిలో 264 మంది (262 పురుషులు, 2 మహిళలు) ఉన్నారు.

# దర్జాగా చోరీ.. అదే ఇంట్లో విశ్రాంతి

భద్రాచలం : ఇంట్లో ఎవ్వరూ లేకపోవడాన్ని పసిగట్టిన ఓ దొంగ దర్జాగా దొంగతనాన్ని వెలగబెట్టి.. అదే ఇంట్లో విశ్రాంతి తీసుకున్న ఘటన భద్రాచలంలో చోటు చేసుకుంది. వివరాలను పరిశీలిస్తే.. భద్రాచలం పట్టణం గోల్డ్‌స్మిత్ కాలనీకి చెందిన ఉండ్రు మాధవరావు తన వ్యక్తిగత పనులపై హైదరాబాద్ వెళ్లారు. వారం నుంచి అక్కడే ఉంటున్నారు. తన ఇంటి ప్రాంగణం మొత్తం కనిపించేలా సీసీ కెమెరానూ అమర్చుకున్నారు. పది గంటలకు తన ఫోన్ ద్వారా సీసీ కెమెరాలో ఇంటిని పరిశీలించారు. మళ్లీ సోమవారం ఉదయం 8 గంటలకు మరోసారి పరిశీలించగా ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనం కనిపించలేదు. వెంటనే తన ఇంటికి సమీపంలోని



తెలిసిన వారికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు వచ్చి పరిశీలిస్తుండగా ఓ యువకుడు ఇంట్లోంచి బయటకు వచ్చి ఒక్క ఉదుటున ఉడాయించాడు. ముఖం కనిపించకుండా టవల్‌ను అడ్డుగా చుట్టుకుని ఉన్నాడు. స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూసి సీసీ కెమెరాను ఆ దొంగ ఎత్తుకెళ్లిపోయినట్లు గుర్తించారు. బీరువాలో ఉన్న ద్విచక్రవాహనం తాళాలతో బైక్‌ను ముందుగానే అక్కడ నుంచి తీసుకెళ్లి దాచినట్లు భావిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గుర్తించి ద్విచక్ర వాహనాన్ని కాజేసిన దొంగ.. ముందు గదిలో విశ్రాంతి తీసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. బీరువాలో దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఆరు నెలల కిందటా అదే ఇంట్లో చోరీ యత్నం జరిగింది. పోలీసులు ఈ ప్రాంతంపై నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

# జీరో టిల్లేజ్‌తో ఉపయోగాలెన్నో..!

అర్సపల్లి : జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు సాగుచేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు కొందరు రైతులు. వరికోసిన తర్వాత పొలంలో దుబ్బులుండగానే దుక్కి దున్నకుండా మొక్కజొన్న, ఇతర విత్తనాలు నాటుకోవడాన్ని జీరోటిల్లేజ్ అంటారు. ప్రస్తుతం వానాకాలంలో రెండు, మూడు భారీ వర్షాలు కురిసినప్పటికీ భూగర్భజలాలు అంతగా పెరగలేదు. ఈ తరుణంలో తక్కువ నీరు, సమయానికి చేతికందే పంటల సాగుకై అన్నదాతలు ఆలోచిస్తున్నారు. వానాకాలం వరికోతలు దాదాపు పూర్తి కావొచ్చిన తరుణంలో జీరో టిల్లేజ్ విధానంలో పంటల సాగుతో పెట్టుబడులు ఎలా తగ్గించుకోవచ్చో ధర్పల్లి, ఇందల్‌వాయి వ్యవసాయాధికారి



ప్రవీణ్‌కుమార్ 'న్యూస్‌టుడే'తో పంచుకొన్నారు. ఈ పద్ధతిలో ముఖ్యంగా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ధర్పల్లి మండలంలోని పలు గ్రామాల్లో చాలా మంది రైతులు ఇదే పద్ధతిలో పెసర సాగు చేస్తున్నట్లు తెలిపారు.

పెట్టుబడుల్లో తగ్గుదల.. జీరో టిల్లేజ్ పద్ధతిలో దుక్కి ఖర్చులు ఉండకపోవడంతో పెట్టుబడులు తగ్గించుకోవచ్చు. వరి తర్వాత పంటలు సాగు చేస్తున్నందున మిగిలిన ఎరువులు సద్వినియోగమవుతాయి. దుక్కి చేయడానికి సరైన సమయం వరకు వేచి ఉండాల్సిన పనిలేదు. ఫలితంగా సమయం ఆదా అవుతుంది. దుక్కి చేయకపోవడంతో నీరు సులువుగా అందించడంతో పాటు వృథాను అరికట్టవచ్చు.

సాగు ఇలా.. వరికోతలు పూర్తవగానే నీటితడి ఇచ్చి 24 గంటల తర్వాత నాటుకునే పంటల్ని అనుసరించి విత్తనాలు విత్తుకోవాలి. ఇందులో కలుపు నివారణకు సరైన సమయంలో మందులు పిచికారీ చేయాలి. ఎరువులన్ని సాధారణ పద్ధతిలో వినియోగిస్తే సరిపోతుంది.

# చేర్యాల.. మూడు దిక్కుల్లో..

చేర్యాల.. 1962 కంటే ముందు జనగామతో కలిసి 'సమితి' కేంద్రంగా వెలుగొందింది. సమితి వ్యవస్థ రద్దయిన తర్వాత నియోజకవర్గ కేంద్రంగానూ 47 ఏళ్ల పాటు కొనసాగింది. అంతేకాకుండా పదేళ్ల పాటు టౌన్ మున్సిపాలిటీగానూ సాగింది. ఆ తర్వాత నిబంధనల మేర మేజర్ పంచాయతీగా మారిపోయింది. దీనికి తోడు 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జనగామ నియోజకవర్గంలో విలీనమైంది. ఇక అక్కడి నుంచి మండల కేంద్రంగానే మిగిలిపోయింది. తిరిగి స్వరాష్ట్రం వచ్చాక మున్సిపాలిటీ హెూదాను దక్కించుకుంది. కాగా ఈ ప్రాంతం జిల్లా పరంగా సిద్దిపేటలో ఉండగా.. శాసనసభ నియోజకవర్గం జనగామ కిందకు వస్తుంది. అదే పార్లమెంటరీ నియోజకవర్గం భువనగిరి పరిధిలో ఉంటుంది. రెవెన్యూ డివిజన్ సిద్దిపేట కాగా, పోలీసు, విద్యుత్తుశాఖ డివిజన్ కార్యాలయం హుస్నాబాద్‌కు, ఇంజినీరింగ్ కార్యాలయం గజ్వేల్‌కు కేటాయించారు. చేర్యాల మూడు దిక్కులకు కేటాయించడం గమనార్హం.

# హోరాహోరీ పోరు.. స్వల్ప మెజారిటీతో విజేతలు

హైదరాబాద్: హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో గెలుపు అంచుల వరకు వెళ్లి ఓటమి పాలైతే ఆ నాయకుల బాధ అంతా ఇంతా కాదు. ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకొని ఐదేళ్లపాటు తలచుకుంటూ ఉంటారు. అలాంటి హోరాహోరీ పోరు నగరంలోనూ జరిగాయి. పదులు, వందల సంఖ్యల ఓట్లతోనే విజయం ఖాయమైన సందర్భాలున్నాయి. ఇంత దగ్గరి వరకు వచ్చి ఓటమి పాలైన నేతలు తర్వాతి సందర్భాల్లో ఆ పొరపాట్లను సరిదిద్దుకొని విజయపతాకం ఎగరేశారు. నగరంలో ఉత్కంఠపోరు జరిగిన సందర్భాలను గమనిస్తే..

1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున హిమాయత్‌నగర్‌లో బరిలో దిగిన సి.క్రిష్ణయాదవ్ 0.1శాతం తేడాతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఆయనకు మొత్తం 88,245 ఓట్లు రాగా.. సమీప ఆలె నరేంద్రపై ప్రత్యర్థిపై కేవలం 67 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

1994 ఎన్నికల్లో మహారాజ్‌గంజ్ నియోజకవర్గం నుంచి భాజపా తరఫున పోటీ చేసిన పి.నారాయణస్వామి ప్రత్యర్థి ఎం.ముఖేశ్‌పై 197 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

1978 ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్(ఐ) తరఫున పోటీ చేసిన పి.జనార్దన్‌రెడ్డి సమీప జనతా పార్టీ అభ్యర్థి ఎ.నరేంద్రపై 654 ఓట్ల



మెజార్టీతో గెలుపొందారు.

1978 ఎన్నికల్లో జనతాపార్టీ తరఫున కంటోన్మెంట్ నుంచి బరిలో దిగిన బి.మచ్చేంద్రరావు సమీప కాంగ్రెస్(ఐ) అభ్యర్థి ముత్తుస్వామిపై 366 ఓట్ల మెజార్టీతో నెగ్గారు.

1978లో మహారాజ్‌గంజ్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్(ఐ) తరఫున బరిలో దిగిన శివ పర్షాద్ సమీప జనతా పార్టీ అభ్యర్థి బద్రి విశాల్ పిట్టిపై 266 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

1983లో ముషీరాబాద్ నుంచి తెదేపా తరఫున బరిలో ఉన్న శ్రీపతి రాజేశ్వర్ జనతా పార్టీ అభ్యర్థి ఎన్.నర్సింహారెడ్డిపై 307 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

1983 ఎన్నికల్లో మేడ్చల్ నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో దిగిన ఉమావెంకట్రామిరెడ్డి సమీప తెదేపా అభ్యర్థి టి.పి.రెడ్డిపై 64 ఓట్ల మెజార్టీతో నెగ్గారు.

2004 ఎన్నికల్లో తెరాస తరఫున ముషీరాబాద్ బరిలో దిగిన నాయిని నర్సింహారెడ్డి సమీప భాజపా అభ్యర్థి కె.లక్ష్మణ్‌పై కేవలం 240 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

2018 ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నుంచి తెరాస అభ్యర్థిగా బరిలో దిగిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమీప అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై 376 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

# ప్రజలకు అందుబాటులో అభ్యర్థుల వివరాలు

జనగామ : ప్రజాస్వామ్యంలో ఓటరే మహారాజు. తనకు సేవ చేసే వారిని ఎన్నుకునేందుకు ఐదేళ్లకో పర్యాయం వచ్చే ఎన్నికలే సరైన వేదిక. మెజార్టీ ఓటర్లు కోరుకున్న రాజకీయ పక్షం, అభ్యర్థులే ప్రజాసేవకులుగా ఎన్నికవుతారు. అందుకే ఓటర్లు విచక్షణతో ఓటు వేసి సరైన అభ్యర్థులను ఎన్నుకోవాలి. ఇందుకోసం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి వారు, వారి ఆస్తి, పాస్తులు, నేరచరిత, విద్యార్హతలు, వయసు తదితర వివరాలను తెలుసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు నామినేషన్లను సమర్పించిన 24 గంటల్లోగా రిటర్నింగు అధికారులు వారి వివరాలు, ప్రమాణపత్రాలను వెబ్ పోర్టల్‌లోకి చేరవేస్తారు. ప్రస్తుత ఎన్నికల్లో 3 నుంచి 9వ తేదీ వరకు పరిమిత సంఖ్యలోనే అభ్యర్థులు నామపత్రాలను దాఖలు చేయడంతో వారి వివరాలు కొద్ది గంటల్లోనే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. చివరి రోజు నామినేషన్ల సంఖ్య



అధికంగా ఉండటంతో వరుస క్రమంలో చేర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఇదిగో యాప్‘నో యువర్ క్యాండిడేట్’ (కేవైసీ) యాప్ ద్వారా అభ్యర్థుల వివరాలు, వారు సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించడమే కాదు, డౌన్లోడ్ చేసుకోవచ్చు. ప్లేస్టోర్, యాప్‌స్టోర్ నుంచి కేవైసీ యాప్‌ను దిగుమతి చేసుకోవచ్చు. ముఖపత్రం తెరిచి, ముందు పేజీకి వెళ్లి, సెలెక్ట్ క్రైటీరియాను క్లిక్ చేయాలి. ఎన్నికలు, రాష్ట్రం, నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకుంటే అభ్యర్థుల వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ఇంకెందుకు ఆలస్యం.. మీరు కోరుకున్న అభ్యర్థులు సమర్పించిన వివరాలను వెంటనే తెలుసుకోండి.

# నలువైపులా నిఘా!

భూపాలపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నియమావళి ఉల్లంఘన, తాయిలాల పంపిణీ, ప్రచారానికి చేస్తున్న ఖర్చు, మద్యం డబ్బు రవాణా వంటి వాటిపై ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వే లైన్స్ బృందాలు 24 గంటల పాటు పరిశీలిస్తున్నాయి. మరోవైపు డబ్బు, మద్యంతో పట్టుబడినప్పుడు వాటిని పక్కాగా ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నారా..? లేదంటే చూసీచూడనట్లు వదిలేశారా..? తదితర అంశాలపై ఉన్నత స్థాయి అధికారులు నిఘా కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

# నిబంధనలు సజీవ దహనం



హైదరాబాద్: మహానగరంలో జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో అమాయకులు మంటల్లో కాలిపోతుంటే.. ఘనత వహించిన హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ), రాష్ట్ర అగ్నిమాపక శాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. ఈ రెండేళ్లలో నగరంలో జరిగిన అగ్నిప్రమాదాల్లో 38 మంది చనిపోయినా బాధ్యులపై తూతూమంత్రంగానే చర్యలుంటున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి జరుగుతున్న వ్యాపారాల వల్ల ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా నిరోధించలేకపోతున్నారు. ఏడాది కిందట అగ్నిమాపక, బల్దియా అధికారులతో కూడిన సర్వే టీములు నగరంలో ప్రధాన రహదారుల్లో భవనాలను తనిఖీలు చేస్తే దాదాపు 30 శాతం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తేలింది. వీటిపై చర్యలు తీసుకోలేదు.. దీనివల్లే నాంపల్లి బజార్‌ఘాట్ ఘటన సంభవించింది.

నిబంధనల ప్రకారం జనావాసాల్లో అగ్నిని దహించే వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ చేయకూడదు. అపార్టుమెంట్ల సెల్లార్లలోనూ ఇతరత్రా భవనాల్లోనూ మంటలు సులభంగా వ్యాప్తి చేసే రసాయనాలు ఉంచకూడదు. బజార్‌ఘాట్ అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని పరిశీలిస్తే ఇక్కడ గత 15 ఏళ్లుగా సెల్లార్‌లో ఫైబర్ రెయిన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్(ఎఫ్‌ఆర్‌పీ)ను పెద్దఎత్తున నిల్వ చేసి అమ్మకాలను సాగిస్తున్నారని తేలింది. ఇక్కడి అపార్టుమెంట్‌లో అద్దెకు ఉన్నవారు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేశారని చెబుతున్నారు. ఫిర్యాదు అందిన ప్రతిసారి ఇక్కడి యజమాని బల్దియా అధికారులకు ఆమ్యామ్యా ఇవ్వడంతో దీన్ని తొలగించలేదు.

నోటీసులు ఇచ్చి..

గతేడాది మేలో సికింద్రాబాద్ బోయిగూడలోని తుక్కు గోదాములో అగ్ని ప్రమాదం జరిగింది. అనంతరం.. నగరవ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న గోదాములను గుర్తించి, వాటిని మూసేయిస్తామని బల్దియా ప్రకటించింది. ప్రాథమిక పరిశీలన చేసి 2వేల గోదాములు అక్రమంగా ఉన్నాయని తేల్చారు. పది పన్నెండు గోదాములపై చర్యలు తీసుకున్నారు. తర్వాత దీని గురించి మర్చిపోయారు. అనంతరం అగ్నిమాపక శాఖ, బల్దియా అధికారులు కలిసి కొన్ని బృందాలను ఏర్పాటు చేశారు. వీరి పరిశీలనలో దాదాపు 30 శాతం భవనాలు నిబంధనలకు అనుగుణంగా లేవని తేల్చారు.వాటిపైనా చర్యలు తీసుకోలేదు.

వరుస ఘటనలు..23 మార్చి 2022: సికింద్రాబాద్ బోయిగూడలోని తుక్కు గోదాములో అగ్ని ప్రమాదం.. 12 మంది బిహార్ కూలీల మృత్యువాత12 సెప్టెంబరు 2022: సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయం పక్కనున్న రూబీ హోటల్‌లో అగ్ని ప్రమాదం.. 8 మంది దుర్మరణం19 జనవరి 2023: సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని డెక్కన్‌మాల్‌లో అగ్నిప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. 21 మార్చి 2023: సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో మంటలు వ్యాపించడంతో.. క్యూనెట్ ఆఫీసులోని ఆరుగురు ఉద్యోగులు చనిపోయారు.

# చీలాపూర్‌లో చిరుత సంచారం

హైదరాబాద్: దామగుండం అటవీ ప్రాంతంలో రెండు వారాలుగా సంచరిస్తున్న చిరుత తాజాగా చీలాపూర్‌లో ప్రత్యక్షమైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన వడ్డె ఆంజనేయులు మరో ఇద్దరితో కలిసి రాత్రి పొలంవద్ద కట్టి ఉంచిన పశువులకు మేత వేసేందుకు వెళ్లినట్లు చెప్పారు. మార్గ మధ్యలో ఓ వ్యవసాయ క్షేత్రం నుంచి దూకి పొలాల వైపు పరుగులు తీసినట్లు చెప్పారు. వారు వెంటనే గ్రామస్థులకు తెలిపారు. గ్రామం గుట్ట ప్రదేశంలో ఉండటంతో రాత్రి వేళ ఇళ్లమధ్యకు వచ్చేందుకు ఆస్కారం ఉందని ఎవరూ బయటకు రావద్దని సర్పంచి రాములు చాటింపు వేయించారు. తమకు సమాచారం వచ్చిందని ఉ




దయాన్నే అక్కడికి చేరుకుని పాదముద్రలు పరిశీలిస్తామని అటవీశాఖ పర్యవేక్షకుడు వీరబాబు తెలిపారు.

వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో పులి సంచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ అటవీశాఖాధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతగిరి, దామగుండం అటవీ ప్రాంతంలోకి ఎవరినీ వెళ్లనీయకుండా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పూడూర్ మండలం దామగుండం అటవీ ప్రాంతంలో మగపులి, అనంతగిరిలో ఆడపులి సంచరిస్తుందని పాదముద్రల ఆధారంగా అధికారులు గుర్తించారు. అధికారులు హెచ్చరికలతో సరిపెట్టకుండా ఎలాంటి ప్రాణహాని జరగకముందే పులిని బంధించి జంతు ప్రదర్శనశాలకు తరలించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# లావాదేవీలపై ప్రత్యేక నిఘా!



భూపాలపల్లి : అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా జరుపుకొనేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేలా మద్యం, నగదు, వివిధ రకాల బహుమతులను ఇచ్చి ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉండటంతో ఎన్నికల సంఘం అలాంటి చర్యలపైనా దృష్టి సారించింది. నియోజకవర్గాల పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు, సరైన పత్రాలు లేని నగదును అధికారులు సీజ్ చేస్తున్నారు. అయినా డబ్బు పంపిణీకి నూతన మార్గాలను ఎంచుకుంటున్నారు. బ్యాంకు ఖాతాల ద్వారా నగదు పంపిణీ జరిగితే ఎలాంటి ఇబ్బందులు రాకుండా సునాయాసంగా నగదు అందించవచ్చని భావిస్తున్నారు. దీంతో ఎన్నికల సంఘం బ్యాంకుల ద్వారా అధిక మొత్తంలో జరిగే లావాదేవీలపై దృష్టి సారిస్తే.. మరింత అక్రమ నగదు పంపిణీపై దృష్టి సారించవచ్చనే ఆలోచనతో బ్యాంకు ఖాతాల్లోని నగదు లావాదేవీలపై నిఘా ఏర్పాటు చేశారు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు జరుగుతున్న లావాదేవీలను పరిశీలిస్తున్నారు. అధిక మొత్తంలో నగదు జమ, డ్రా చేయడం చేస్తే అలాంటి ఖాతాలకు సంబంధించిన వివరాలను సంబంధిత బ్యాంకు అధికారులు అధికారులకు సమాచారం ఇచ్చేలా ఆదేశిస్తున్నారు.

మహిళా సంఘాల ఖాతాలపైనా..

ఎన్నికలకు సంబంధించిన అంశంలో మహిళా ఓటర్లకు ఉన్నంత ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. మహిళా ఓటర్లను మచ్చిక చేసుకుంటే వారి కుటుంబంలోని ఓట్లను కూడా తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనే అభిప్రాయం ప్రతి అభ్యర్థిపై ఉంటుంది. గ్రామాల్లో మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి గెలుపునకు సహకరించాలని కోరుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. వారికి నగదు పంపిణీ చేయాలంటే మహిళా సంఘాల ఖాతాలో నగదు జమ చేస్తే బృందంలోని సభ్యులంతా పంచుకుంటారనే ఆలోచనలోనూ అభ్యర్థులు ఉన్నారు. అలాంటి వాటిపైనా ఎన్నికల కమిషన్ నిఘా పెంచింది. బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు కాకుండా ఇతర వ్యక్తులు, సంస్థల నుంచి స్వయం సహాయక సంఘాలకు ఏవైనా నగదు వస్తున్నాయా..? లేదా అనే వివరాలను నిశితంగా పరిశీలిస్తూ అక్రమంగా జరిగే లావాదేవీలపై అధికారులు విచారణ జరిపి ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే ఖాతా సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

డిజిటల్ చెల్లింపులపై..

గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా ఆండ్రాయిడ్ ఫోన్ అందుబాటులో ఉంటే గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా పెద్ద మొత్తంలో నగదు బదిలీ జరుగుతోంది. డిజిటల్ ఖాతాల ద్వారా రూ.లక్షల్లో లావాదేవీలు జరిగితే సంబంధిత ఖాతాదారుల నుంచి వివరణ తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు వారి బంధువుల ఖాతాల వివరాలను పరిశీలించే అవకాశాలు ఉంటాయని అధికారులు అంటున్నారు.

# పాఠశాలకు చేరని పాఠ్య పుస్తకాలు

నల్గొండ : విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన సమయంలో పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల పునఃప్రారంభ సమయంలో మొదటి విడత పుస్తకాలు సకాలంలో సరఫరా చేసి పంపిణీ చేశారు. వేసవిలోనే ఉన్నతాధికారుల పర్యవేక్షణతో పాటు ముందస్తు చర్యలు తీసుకోవడంతో పుస్తకాలు జూన్‌లోనే విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. వెంటనే ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆ తర్వాత రెండో భాగం పుస్తకాలు అక్టోబరు 15 నాటికి రావాల్సి ఉన్నా నేటికీ రాలేదు.

రెండు భాగాలేంటి? తెలుగు మీడియం ఆరంభం నుంచి పాఠశాల విద్యాశాఖ ఒకే భాగంతో పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తోంది. గత ఏడాది అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారంభించారు. రెండు భాషలకు అనుగుణంగా ఉండేందుకు ప్రతి పుస్తకం రెండు భాషల్లో ముద్రించారు. అంటే ఒక పేపరులో ఒక పేజీ తెలుగులో మరో పేజీ ఆంగ్లంలో పాఠాలను ముద్రించారు. ఎందుకంటే ఒకేసారి తెలుగు మీడియం నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి వెళ్లిన విద్యార్థికి ఆంగ్లం అర్థం కాకపోతే తెలుగు చూసుకునే వీలుండేలా ఏర్పాటు చేశారు. ఇలా ముంద్రించడం వల్ల పేజీల సంఖ్య రెట్టింపయింది. దాంతో పుస్తకాల బరువు పెరిగింది. దీన్ని గుర్తించి ప్రభుత్వం ప్రతి పుస్తకాన్ని రెండు భాగాలుగా ముద్రించి సరఫరా చేయాలని నిర్ణయించింది. అందుకే ప్రతి సబ్జెక్టులో (గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్రం) సగం పాఠాలు(చాప్టర్స్) మొదటి భాగంలో ముద్రించి జూన్‌లోనే సరఫరా చేశారు. ఆ భాగం పాఠాలను అక్టోబరు 15 నాటికి అంటే దాదాపు దసరా నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేశారు.



పరీక్షలు నిర్వహించారు. దసరా సెలవుల అనంతరం రెండో భాగం పాఠాలు బోధించాల్సి ఉన్నా నేటికీ పుస్తకాలు అందుబాటులోకి రాలేదు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి 1,29,510 రెండో భాగం పుస్తకాలు వచ్చాయి. విద్యార్థులపై ఒత్తిడి సకాలంలో పాఠ్య పుస్తకాలు రాకపోవడం, పాఠాలు బోధించకపోవడంతో ఒకేసారి సిలబస్ పూర్తి చేయాలంటే విద్యార్థులపై భారం పడుతుంది. వేగం పెంచితే ఒత్తిడి పెరిగి మానసికంగా ఇబ్బంది పడే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు, ఎంఈవోలు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. జిల్లా కేంద్రాలకు వచ్చిన పుస్తకాలను తెచ్చి ఇవ్వడమంటే జాప్యం జరిగే అవకాశం ఉంది. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే పంపిణీ పూర్తి చేయగా మరికొన్ని జిల్లాల్లో ప్రక్రియ జరుగుతుంది. సూర్యాపేట జిల్లాలో నేటి వరకు పుస్తకాలు మండలాలకు రాలేదు. అధికారులు స్పందించి వెంటనే పుస్తకాలను విద్యార్థులకు చేరేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# బరి.. గురి..!

నల్గొండ :అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. నామినేషన్ల పరిశీలన ప్రారంభం కానుంది. ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నుంచి బరిలో ఉండే అభ్యర్థులెవరో తేలడంతో వారంతా ఇప్పుడు ప్రచారంపై దృష్టిసారించారు. మరో 20 రోజులే సమయం ఉండటంతో సభలు, సమావేశాలతో పాటూ ప్రధాన పార్టీల రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలతో తమకు రోడ్‌షోలను నిర్వహించాలని ప్రణాళికలు రచిస్తున్నారు.

భారాస.. ఇంటింటి ప్రచారానికి కసరత్తు

అధికార భారాస ఇతర పార్టీల కంటే కొన్ని రోజుల ముందుగానే ప్రచారం ప్రారంభించింది. ఆ పార్టీ అభ్యర్థులు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం వరకు ప్రచారం నిర్వహిస్తుం డగా..రాత్రి వేళల్లో అసమ్మతులు, సామాజిక వర్గాల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేస్తూ గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నిక నాటి నుంచే ప్రతి 100 మంది ఓటర్లకు ఒక ఇన్‌ఛార్జ్ చొప్పున నియమించారు. వారంతా ఇప్పుడు ఆ 100 మంది ఓటర్లను నిత్యం కలిసి వారిని పోలింగ్‌బూత్‌కు తీసుకువచ్చి వారంతా పార్టీ అభ్యర్థికి ఓటేసే వరకు సదరు ఇన్‌ఛార్జే బాధ్యత వహించనున్నారు. దీంతో ప్రతి పోలింగ్ బూత్‌లో సదరు ఇన్‌ఛార్జ్‌లతో ఒకటి రెండు రోజులకొకసారి పార్టీ అభ్యర్థి సమావేశమవుతూ క్షేత్రస్థాయి పరిస్థితిని ఆరా తీస్తున్నారు. మరోవైపు మంత్రి జగదీశ్‌రెడ్డి ఇతర పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలను పార్టీలో చేర్చుకునే వ్యూహంతో ముందుకెళ్తున్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన పాల్వాయి స్రవంతి ఇంటికి స్వయంగా వెళ్లి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు.

భాజపా.. మోదీ సభతో పతాకస్థాయికి ప్రచారం

ప్రధాని మోదీ సభ నల్గొండలో నిర్వహించాలని ఇప్పటికే రాష్ట్ర పార్టీ ప్రాథమికంగా నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 17 నుంచి 22వ



తేదీల మధ్య ఒక రోజు ప్రధాని సభకు రాష్ట్ర పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గాల్లో గ్రామాలు, మండలాల్లో రోడ్‌షోల ద్వారా ప్రచారం చేస్తున్న పార్టీ అభ్యర్థులు ప్రధాని సభ ద్వారా ప్రచారాన్ని పతాక స్థాయికి తీసుకుపోవాలని నిర్ణయించారు. మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్‌లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రోడ్‌షో, చండూరులో ఈటల రాజేందర్, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సభలను నిర్వహించాలని కేంద్ర పార్టీని నేతలు సంప్రదించారు. ఒకట్రెండు రోజుల్లో ఈ సభలు ఖరారు కానున్నాయి. ఈ దఫా ఉమ్మడి జిల్లాలో బోణి కొట్టడమే లక్ష్యంగా సంస్థాగతంగా బలంగా ఉన్న నియోజకవ ర్గాల్లో పార్టీ ఆర్‌ఎస్‌ఎస్ వలంటీర్లను రంగంలోకి దించుతోంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో వారు పనిచేస్తుండగా.. మరికొన్నింటిలో ఉత్తరాది నుంచి పేరున్న నేతలు ఇక్కడే బస చేయడానికి నిర్ణయించారు.

కాంగ్రెస్.. అధికార పార్టీ వైఫల్యాలే ఆయుధంగా

ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధికార భారాస వైఫల్యాలే ఆయుధంగా ప్రజల్లోకి వెళ్తోంది. నిరుద్యోగులు, ఉద్యోగాల కల్పన తదితర అంశాలతో పాటూ ఆ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ఆరు గ్యారంటీలను క్షేత్రస్థాయి ప్రచారంలో ప్రజలకు వివరిస్తున్నారు. ఇప్పటి వరకు సభలు, సమావేశాలతోనే ప్రజల మద్దతు కూడగడుతున్న అభ్యర్థులు త్వరలోనే రోడ్‌షోలు, ఇంటింటికి తిరగడం ద్వారా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆలేరు, తుంగతుర్తి, నాగార్జునసాగర్ అభ్యర్థులు తొలిసారి పోటీ చేయనుండటంతో పాటూ మిగిలిన అభ్యర్థులు పోలింగ్ చివరి రోజుల్లో కీలకమయ్యే పోల్‌మేనేజ్‌మెంట్ ఎలా చేయాలనే దానిపై ఇప్పటి నుంచే సంబంధిత వర్గాలతో చర్చిస్తున్నారు. ఇప్పటికే కోదాడ, హుజూర్‌నగర్‌లలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రోడ్‌షో నిర్వహించగా...ఎన్నికలకు వారం రోజుల ముందు నల్గొండలో ప్రియాంక గాంధీ రోడ్‌షోకు పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు.

# బతికి సాధించండి!

కరీంనగర్ : ఏప్రిల్ 13న కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయానికి భూ సమస్య పరిష్కారం కోసం వచ్చిన ఓ రైతు ఆత్మహత్య చేసుకుని ప్రాణాల్ని కోల్పోయాడు. మండల పరిధిలోని ఖాజీపూర్ మధిర గ్రామమైన ఐలవోనిపల్లెకు చెందిన అనుగుల మల్లేశ్ (55) కార్యాలయం వద్ద ఉన్న బెంచీపై కూర్చుని క్రిమిసంహారక మందుని తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తనకున్న భూమిలో ఓ 20 గుంటలు వ్యవసాయేతర భూమి కింద రికార్డుల్లో చూపిస్తుండటంతో గత కొన్నాళ్లుగా బాధితుడు అధికారుల చుట్టూ తిరిగాడు. పాసు పుస్తకంలో మార్పు కోసం తిరిగి వేసారిన ఇతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడు చనిపోయిన మరుసటి రోజునే ఈ సమస్యను అధికారులు పరిష్కరించారు. అతనికి రావాల్సిన భూమిని హక్కుపత్రాల్లో పొందుపర్చారు.

నాలుగు జిల్లాల కలెక్టరేట్‌లలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎక్కువ శాతం భూ సంబంధిత సమస్యలపైనే ఫిర్యాదులు ఉంటున్నాయి. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యను దూరాభారమైనా జిల్లా అధికారులకు విన్నవించేందుకు వస్తున్నారు. తీరా ఆ దరఖాస్తు మండలస్థాయి అధికారికి చేరుతుండటం.. పరిష్కారం విషయంలో మీనమేషాలు లెక్కిస్తుండటంతో మళ్లీ విషయం మొదటికి వస్తుంది. ఒక్క రోజులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున 850 దరఖాస్తులు అందితే అందులో 350 వరకు భూ సమస్యలే ఉంటున్నాయి.

తీరొక్క వ్యథలు..

ఊరూరా సగటున 20 నుంచి 30 మంది వరకు భూ సమస్యలతో సతమతమవుతున్నారు. రికార్డుల్లో మార్పులు చేర్పులతోపాటు భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, రికార్డుల్లో తప్పులు, ఇతరుల పట్టాల్లోకి భూమి వెళ్లడం లాంటి సమస్యలు సతమతం చేస్తున్నాయి. దీంతో ప్రతిరోజు రెవెన్యూ కార్యాలయం గడప తొక్కుతున్నవారి సంఖ్య పెరుగుతోంది.



తిరిగి తిరిగి వేసారిన వాళ్లు మరణమే శరణ్యమన్నట్లు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్న ఉదంతాలు అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. 2017లో చేపట్టిన భూదస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం (ఎల్‌ఆర్‌యూపీ) సమయంలోనే దాదాపుగా నాలుగు జిల్లాల పరిధిలో 95 శాతానికిపైగా జాగాల విషయంలో స్పష్టత వచ్చింది. రికార్డుల నవీకరణ విషయంలో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి సారిగా ప్రక్రియను పూర్తిచేసిన ఘనతను అందుకుంది. క్షేత్రస్థాయికి వెళ్లిన బృందాలకు భూ హక్కుదారులు తమ వద్ద ఉన్న మాతృదస్త్రాలు (1బీ) పరిశీలించుకుని రికార్డుల్లో అనుసంధానించుకున్నారు. సాదాబైనామాల విషయంలో రెండు దఫాలుగా ఇచ్చిన అవకాశానికి వెల్లువలా అర్జీలు అందాయి. అయినా పరిష్కార మార్గాలు సరిగ్గా లేకపోవడంతో ఈ చిక్కులు నిత్యకృత్యమవుతున్నాయి.

అధికారులు దృష్టి పెడితేనే..

కొన్ని సమస్యలు అధికారుల స్థాయిలో పరిష్కరించే అవకాశమున్నా తమకెందుకు ఇబ్బందని పరిష్కరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మండల స్థాయిలోనే పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నా అధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్ల బాధితులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు సమస్యల పరిష్కారంపై పూర్తిస్థాయిలో దృష్టి పెడితే రైతులు జాగాల కోసం ఆత్మహత్యల గురించి ఆలోచించే పరిస్థితి రాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తన భూమి పత్రాలను అధికారులు ఫోర్జరీ చేశారని ఆరోపిస్తూ ఈ నెల 12న ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన రామచంద్రరావు (75) పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. విశ్రాంత ఉద్యోగి అయిన ఆయన తన భూమి విషయమై యంత్రాంగం పట్టించుకోలేదనే వేదనతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలో జగిత్యాల, సిరిసిల్ల కలెక్టరేట్ ఆవరణలో భూమి సమస్య కోసం వేర్వేరు సందర్భాల్లో అధికారులకు వినతిని ఇచ్చేందుకు వచ్చిన కొందరు ఆత్మహత్యకు ప్రయత్నించిన సందర్భాలున్నాయి.

విజయాలున్నాయి..

భూ సమస్యలపై పోరాటాన్ని సాధించి విజయం సాధించిన వారెందరో ఉమ్మడి జిల్లాలో ఉన్నారు. సమస్య పరిష్కారానికి ప్రస్తుతం ఎన్నో పరిష్కార వేదికలున్నాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదుతోపాటు పని చేయకుండా ఇబ్బందులు పెట్టేవారిని పట్టుకునేందుకు అనిశా విభాగముంది. సమాచార హక్కు చట్టాన్ని ప్రయోగిస్తూ ఎందరో విజేతలుగా నిలిచిన వాళ్లున్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని భూ ఇబ్బందుల్ని పరిష్కరించుకోవాలి. ప్రాణాలు పోయినంత మాత్రాన పరిష్కారం జరగదనే విషయాన్ని వారు గుర్తించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 11,82,300 హెక్టార్ల భూమి ఉంది. ఇందులో అటవీ, ప్రభుత్వ భూమి 2,50,410 హెక్టార్లు. నివాసాలున్న ప్రాంతాల భూ విస్తీర్ణం 95,963 హెక్టార్లు ఉండగా.. మిగతా జాగా అంతా సాగు సహా ఇతర అవసరాలకు వాడుతున్నదే.! సమగ్ర భూ సర్వే తరవాత ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినప్పటి నుంచి సమస్యలు ఎక్కువయ్యాయని బాధితులు తరచూ ఆవేదనను వినిపిస్తున్నారు. కాగితాల్లో ఉన్న రికార్డులకు ఆన్‌లైన్‌లో ఉన్న గణాంకాలకు చాలాచోట్ల వ్యత్యాసం ఉండటమే సమస్యకు ప్రధాన కారణం. దాదాపుగా 12 రకాల సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. చిన్నపాటి సమస్యల కోసం నెలల తరబడి తిరగాల్సిన దుస్థితి భూ యజమానులకు ఎదురవుతోంది.

## పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి

కామారెడ్డి : ఏటా వానాకాలంలో వ్యాధుల భయం పొంచి ఉంది. పారిశుద్ధ్య స్థితిని మెరుగుపర్చడంలో యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలోని ఆయా నగర, పురపాలక సంఘాల్లో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. తాజాగా పురపాలక శాఖ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ పారిశుద్ధ్యాన్ని చక్కదిద్దేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నేటి ఈ నెల 27వ తేదీ వరకు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కథనం. ఖాళీస్థలాల్లో మారని తీరు.. ఖాళీ స్థలాల్లో మురుగు నీరంతా నిలిచి దోమల సంతతికి కేంద్రాలుగా మారుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వేలాది ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకుంటామని గతంలో అధికారులు పేర్కొన్నా మార్పు లేదు. ప్రస్తుతం చేపట్టనున్న కార్యక్రమంలో ఖాళీ స్థలాలను శుభ్రపరచడంపై దృష్టిసారించనున్నారు. నాలాలు, వరద నీటి కాల్వల పూడకతీతపై చర్యలు తీసుకోనున్నారు. బల్దియాల్లో సరిపడా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైపులైన్ల లీకేజీలను గుర్తించి తక్షణం సరిచేయడంలో జాప్యమేర్పడుతోంది. నీటి సరఫరా విభాగ అధికారులు, సిబ్బంది స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

# 'మన బడి' పనులు చతికిల



వరంగల్ : సర్కారు పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఏప్రిల్‌లో 'మన ఊరు – మనబడి' కార్యక్రమానికి మం గత ఏడాది ఏప్రిల్ మాసంలో శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. మొదటి విడతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి గతేడాది వేసవి సెలవుల్లో పనులు ప్రారంభించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే వరంగల్ జిల్లాలో ఆనుకున్న స్థాయిలో పనులు జరగడం లేదు. పనులు చేపట్టి 14 నెలలు గడిచినా కేవలం 23 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 186 పాఠశాలల్లో 40 శాతం కూడా కాలేదు. 14 చోట్ల అసలు పనులే ప్రారంభించలేదు. మరో మూడు వారాల్లో వేసవి సెలవులు ముగిసి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నాయి. పరిస్థితి చూస్తుంటే ఈ ఏడాది కూడా పనులు పూర్తి కావడం కష్టమేనని ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. నిధుల కొరతతోనే పనులు సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం 'న్యూస్‌టుడే' బృందం పాఠశాలల్లో పనులను పరిశీలించింది. వివిధ పాఠశాలల్లో తీరుపై కథనం..

ముందుకు రాని గుత్తేదారులు..

పాఠశాలల్లో రూ.30 లక్షలలోపు పనులను ఎస్‌ఎంసీల ద్వారా పూర్తి చేయాలి. బడ్జెట్ ఎక్కువ ఉన్న పనులను గుత్తేదారులకు అప్పగిస్తున్నారు. చాలా చోట్ల పూర్తి చేసిన పనులకు నిర్ణీత వ్యవధిలో బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేపట్టడానికి గుత్తేదారులు, ఎస్‌ఎంసీల బాధ్యులు ముందుకు రావడంలేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు ఇవ్వకపోవడంతో నష్టపోతున్నట్లు ఓ గుత్తేదారు తెలిపారు. అప్పులు తెచ్చి పనులు చేస్తున్నా సకాలంలో బిల్లులు రాక, వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కొందరు బిల్లులు రావేమోనని పనులు చేయడానికి ముందుకు రావడం లేదు.

చేపట్టే పనులు..

మరుగుదొడ్లు, ప్రహరీలు, వంటగదుల నిర్మాణం, తాగునీరు, ఫర్నీచర్, ఆకుపచ్చ రాతబోర్డుల ఏర్పాటు, రంగులు వేయడం, పెద్ద, చిన్న మరమ్మతులు, శిథిల భవనాల స్థానంలో కొత్తవి నిర్మించటం.

నత్తనడకన సాగుతూ..

వర్ధన్నపేట మండల పరిధిలోని 12 బడులను మన ఊరు–మన బడి పథకం కింద అధికారులు ఎంపిక చేశారు. ప్రహరీ, డైనింగ్ హాల్, వంట షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్తు, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర పనులు చేపట్టారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనులకు టెండర్లు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దమ్మన్నపేట, వర్ధన్నపేటలోని ఉర్దూ పాఠశాలల్లో మాత్రమే పనులు చివరి దశకు చేరుకున్నాయి. మిగిలిన 10 బడుల్లో 30 నుంచి 50 శాతం మాత్రమే పనులు జరిగాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల మంజూరులో ఆలస్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నట్లు ఎంఈవో రంగయ్య తెలిపారు. జూన్ 10 వరకు పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించినట్లు పేర్కొన్నారు. పనులను పరిశీలిస్తే క్షేత్రస్థాయిలో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

గోడలపై రంగుల బొమ్మలు.. పెద్ద ద్వారం.. పచ్చని చెట్లు.. రంగులతో మెరిసిపోతున్న భవనం.. దీన్ని చూసి కార్పొరేటు విద్యా సంస్థ అనుకుంటే పొరబడినట్లే. మన బస్తీ– మన బడి కార్యక్రమంలో నర్సంపేట పురపాలిక పరిధిలోని హనుమాన్‌దేవల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 383 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రవేశాలకు తీవ్రమైన పోటీ ఉంది. మన బస్తీ– మన బడి పథకంలో రూ.8.53 లక్షలు మంజూరు కాగా.. విద్యుత్తు పనులకు రూ.1.90 లక్షలు, తాగునీటి వసతికి రూ.1.25 లక్షలు, మేజర్, మైనర్ మరమ్మతులకు రూ.1.32లక్షలు వెచ్చిఆరు. రూ.4.06 లక్షలతో వంట గదిని గత ఫిబ్రవరిలోనే పూర్తి చేశారు. రంగుల డెస్క్ బెంచీలు, గ్రీన్‌బోర్డు కూడా వచ్చాయి.

పనులపై పూర్తిపై ప్రత్యేక సమావేశం..– డి.వాసంతి, జిల్లా విద్యాశాఖ అధికారి

పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి సంబధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. పాఠశాలల పునః ప్రారంభం నాటికి సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏ దశల్లో పనులు జరుగుతున్నాయో తరచూ కలెక్టర్ సమీక్షిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎస్‌ఎంసీ బాధ్యులు, గుత్తేదారులకు సూచించారు. నిరంతరం అధికారులు, పాలకులు పర్యవేక్షిస్తున్నారు.

# బెట్టింగ్ వల.. చిక్కుకుంటే విలవిల



వరంగల్ : క్రికెట్‌ను బెట్టింగ్ రాయుళ్లు సొమ్ముగా మార్చుకుంటున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సందడి నెల కొంది. కొద్ది పాటి సొమ్ముతో లాభాలు వస్తాయనే ఆశతో యువత, నిరుద్యోగులు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల చేతుల్లో బలవుతున్నారు. వరంగల్ మహానగరంతో పాటు పల్లెల్లోనూ బెట్టింగ్ చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. హనుమకొండకు చెందిన విద్యార్థి కళాశాల ఫీజు కడతానని తల్లిదండ్రుల వద్ద డబ్బులు తీసుకొని క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడ్డాడు. చివరకు ఉన్న డబ్బులు పోవడంతో ఫీజు కట్టడానికి ఇబ్బందులు పడ్డాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో తీవ్రంగా మందలించారు. గత నెలలో సుబేదారి ఠాణా పరిధిలో క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి చేశారు. వారి నుంచి రూ. 40వేలు నగదు, చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్‌లో హనుమకొండ ఠాణా పరిధిలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన క్రికెట్ బెట్టింగ్ బుకీ అరెస్టు చేసి ల్యాప్‌టాప్, చరవాణి, స్వాధీనం చేసుకున్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పోటీలు జరుగుతున్నాయి. జట్ల మధ్య వీరోచిత పోటీ.. బంతిబంతికి ఉత్కంఠ.. ఇలాంటి వాటిని యువత ఆసక్తికరంగా చూస్తారు. పనులన్నీ పక్కకు పెట్టి టీవీలు, చరవాణులకు అతుక్కుపోతుంటారు. ఇదే సమయంలో కొంతమంది బెట్టింగ్‌లు కాస్తుంటారు. గతంలో డబ్బులు పెట్టి పందెం కాసేవారు. మారిన పరిస్థితులలో ఆన్‌లైన్, ఎలక్ట్రానిక్ డివైజ్, చరవాణులను వినియోగించుకుంటూ గూగుల్‌పే, పేటీఎం, ఫోన్‌పే... ద్వారా బెట్టింగ్ కాస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా ప్రయత్నిస్తున్నారు. వరంగల్ మహానగరంలో గత కొద్ది రోజుల నుంచి జోరుగా పందేలు సాగుతున్నాయి. ఈ క్రమంలో గతంలో బెట్టింగ్‌లు పెట్టిన వారి వివరాలను పోలీసులు సేకరించారు. వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారో ఆరా తీస్తున్నారు.

బంతి బంతికి..

సాధారణ క్రికెట్ మ్యాచ్‌ల కంటే ఐపీఎల్ భిన్నంగా ఉంటుంది. 20 ఓవర్ల మ్యాచ్‌లు కావడంతో బంతి బంతికి బెట్టింగ్ పెడుతుంటారు. లేదంటే గెలుపు ఓటములపై పందేలు రూ. 500 నుంచి రూ. 10వేల వరకు కాస్తుంటారు. ఇందుకోసం నగరంలో ప్రత్యేకంగా గదులను అద్దెకు తీసుకున్నారు. టీవీలతో పాటు ఇతర సదుపాయాలు కల్పించారు. మరికొందరు హొటళ్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు, నగరశివారుల్లోని అడ్డాల వద్ద బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం చరవాణుల ద్వారా వ్యవహారం నడుస్తోంది. దళారులు పదిశాతం కమీషన్ మినహాయించుకొని గెలిచిన వ్యక్తికి మిగతా మొత్తాన్ని ఇస్తున్నారు. వరంగల్ నగరంలో కొంతమంది దళారులున్నారు. యువకులు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నారు.

మొదట నిర్వాహకులు బెట్టింగ్ వెబ్‌సైట్‌లో సభ్యుడిగా చేర్పిస్తారు. వీరికి ఓ రహస్య ఐడీ, పాస్‌వర్డు ఇస్తారు. దీని ద్వారా అడ్మిన్‌గా ఉంటూ ఆన్‌లైన్‌లో మరికొందరిని యూజర్లుగా చేసుకుంటారు. వారికి వెబ్‌సైట్ లింక్‌లు పంపి.. వాటిని డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పి.. పందెం కాస్తున్నారు. ఒకే సమయంలో 30 మందికిపైగా మాట్లాడానికి కమ్యూనికేటర్లు బాక్సులను ఏర్పాటు చేసుకుంటారు. ఓడిన వారు గెలిచిన వారికి నగదును ఆన్‌లైన్ చెల్లింపు యాప్ ద్వారా బదిలీ చేస్తారు.

అప్రమత్తంగా ఉన్నాం

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి

ఐపీఎల్ బెట్టింగ్‌పై నిఘా ఉంచాం. అన్ని ఠాణాలను అప్రమత్తం చేశాం. తల్లిదండ్రుల కూడా తమ పిల్లలపై నిఘా పెట్టాలి. బెట్టింగ్‌లతో జీవితాలు చిన్నాభిన్నం అవుతాయి. కేసులు నమోదైతే భవిష్యత్తు ఇబ్బందికరంగా ఉంటుంది.

# వానాకాలం పంటలకు ద్రవ రూప డీఏపీ

వరంగల్ : మోత బరువులు.. రవాణా వ్యయం, అత్యవసర సీజన్‌లో బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు డీఏపీ బస్తాల కొనుగోలు చేయాల్సిన అవసరం ఇక రైతులకు ఉండదు.. ఇఫ్‌కో (ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్) నానో డీఏపీ ద్రవరూప ఎరువును రైతులకు అందుబాటులోకి తెచ్చింది. లీటరు, అరలీటరు సీసాల్లో లభిస్తోంది.

ఉమ్మడి జిల్లా రైతులకు మేలు ఇలా....ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 9.5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఎకరానికి రెండు బస్తాల డీఏపీకి బదులు నానో డీఏపీ వినియోగిస్తే పెట్టుబడి వ్యయం ఎకరానికి సగటున రూ.5 వేలు తగ్గే అవకాశం ఉంది. మొక్కజొన్న, పత్తి, పండ్లతోటలు, మిరప వంటి పంటలకు నేరుగా మొక్కలపై పిచికారీ చేస్తే ప్రయోజనం కలుగుతుంది. ఇప్పటి వరకు బస్తాల్లో ఉండే డీఏపీ గుళికలను వరి నాటు వేసే ముందు పొలం మొత్తం చల్లేవారు. ఒక్కోసారి నాట్లు వేసే సమయంలో కూలీలు తొక్కుతుండడంతో పొలమంతా విస్తరించకుండా ఒకేచోట చేరేది. నానో డీఏపీతో ఈ సమస్య ఉండదు. మరోవైపు ఎక్కువ పోషకాలు సమకూర్చుతున్నందున పంట దిగుబడులు పెరిగి రైతులకు అదనంగా ఆదాయం సమకూరనుంది. ప్రయోజనాలివీ..ఏళ్ల తరబడి రసాయన ఎరువులను అధిక మొత్తంలో రైతులు వినియోగిస్తున్నారు. ఇది ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించిందని భావించిన ప్రభుత్వం ద్రవరూప నానో డీఏపీని తయారు చేయాలని నిర్ణయించింది. రెండేళ్ల కిందట నానో యూరియాను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ప్రస్తుతం అదేబాటలో డీఏపీని తీసుకొచ్చారు.డీఏపీ బస్తాలను ఎరువుల కర్మాగారాల నుంచి రైతు పొలాల వరకు వివిధ దశల్లో తరలించే రవాణా వ్యయం తప్పుతుంది. ఇలా రైతులకు రవాణా ఖర్చులు, ప్రభుత్వానికి గోదాముల అద్దెలు తగ్గిపోతాయి.'ఎకరానికి అరలీటరు నానో డీఏపీ సరిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్ప్రేయర్లతో పిచికారీ చేస్తే పొలం మొత్తానికి విస్తరించే అవకాశం ఉంది. సాధారణంగా ఎకరానికి రెండు బస్తాల డీఏపీని రైతులు వినియోగిస్తుండగా సగటున రూ.3 వేల ఖర్చు అవుతుంది. నానో డీఏపీతో ఒక సీసా ధర సగటున రూ.600 వరకు మాత్రమే ఉంటుంది. రైతులకు డబ్బు ఆదా అవుతుంది.'రైతుల్లో చైతన్యం తెస్తాం..కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, హనుమకొండ జిల్లాఈ వానాకాలం సీజన్‌లో రైతులు డీఏపీ బస్తాలకు బదులుగా ద్రవరూప నానో డీఏపీ వినియోగించేలా అవగాహన కల్పిస్తాం. నానో యూరియా వినియోగంపై రెండేళ్లుగా రైతులకు అవగాహన కల్పించగా వారిలో మార్పు వచ్చింది.

# తరుగు పేరిట టోకరా

మిర్యాలగూడ : పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన రైతు సుధాకర్ ఆరెకరాల్లో మామిడి సాగు చేపట్టారు. పంటను విక్రయించేందుకు సూర్యాపేటకు తీసుకొచ్చారు. ఇక్కడి వ్యాపారులు మామిడి కాయలు నాణ్యతగా లేవని గిట్టుబాటు ధర కల్పించలేదు. ఇదేమని వారిని రైతు ప్రశ్నిస్తే టన్నుకు రూ.25 వేలు కట్టించారు. మిగతా 20 మంది రైతులకు అంతకు తక్కువ ధరే చెల్లించారు. వ్యాపారుల దోపిడీతో మామిడి రైతులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మామిడి కొనుగోలు కేంద్రాల్లో వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారు. ఇతర ప్రాంతాల వ్యాపారులతో కుమ్మక్కై తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ కర్షకులను నిలువునా దోచుకుంటున్నారు. కాయలు నాణ్యతగా ఉన్నా వివిధ కారణాలు చూపుతూ తక్కువకే కొంటున్నారు. మార్కెట్ ధర ప్రకారం టన్నుకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.20 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇదేమని కర్షకులు ప్రశ్నిస్తే ఈదురుగాలులు, ఇటీవల అకాల వర్షాలకు తడిసిన కాయలు తీసుకొస్తున్నారని సాకులు చెబుతున్నారు.

ధర తక్కువ.. తూకాల్లో మోసం

జిల్లాలో ఈసారి 10,720 ఎకరాల్లో మామిడి సాగు చేపట్టారు. ఆశించిన మేర దిగుబడి రాకపోయినా ఈదురుగాలులు, అకాల వర్షాలకు రైతులు నష్టపోయారు. జిల్లా కేంద్రంలోని మామిడి విక్రయ కేంద్రానికి రోజూ వందల టన్నుల మామిడి కాయలను కర్షకులు తీసుకొస్తున్నారు. కాయలు పాకానికి రాలేదని, చిన్నగా ఉన్నాయని, పండుకాయలు తీసుకొచ్చారని ఇలా కారణాలు చూపి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. రెండ్రోజుల క్రితం ధర విషయంలో వ్యాపారులతో రైతులు గొడవకు దిగారు. తూకాల్లోనూ వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. టన్ను మామిడి కాయలకు రెండు క్వింటాళ్ల మేర తరుగు తీసి నష్టపరుస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీలు శూన్యం

మార్కెట్, ఉద్యాన, తూనికలు, కొలతల శాఖ అధికారులు మామిడి కొనుగోళ్లను తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. దీంతో అన్నదాతలు అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీ చేసి చర్యలు చేసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు: ఫసియొద్దీన్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట మామిడి కొనుగోలు కేంద్రాల్లో మోసాలకు పాల్పడుతున్న విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం. రైతులు కూడా మోసాలపై ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# ఆర్టీసీ కార్గో ప్రైవేట్‌పరం

మిర్యాలగూడ : వరుస నష్టాల నుంచి గట్టెక్కడంతో పాటు వివిధ మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో ఆర్టీసీ 2020 జూన్ 19న సరకు రవాణా(కార్గో) సేవలను ప్రారంభించింది. తొలుత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల పరిధిలో రూ.3 వేలతో ప్రారంభమై ప్రస్తుతం రూ.1.5 లక్షలకు పైగా రోజు వారీ ఆదాయం పెరిగింది. కార్గో కార్యాలయాల్లో విధులు నిర్వర్తించేందుకు ప్రతి డిపోకు ఒక మార్కెటింగ్ అధికారితో పాటు ఆర్టీసీ, పొరుగు సేవల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. కాగా కార్గోను లాజిస్టిక్స్‌గా మార్చిన అధికారులు దీనిని ప్రైవేట్ ఏజెంట్లకు అప్పగించేందుకు చర్యలు ముమ్మరం చేశారు.

రాబడి పెరిగినా ప్రైవేట్‌కే మొగ్గు..

ఇటీవల కాలంలో ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆదాయం గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి మే 17 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లాజిస్టిక్స్ ద్వారా రూ.1.90 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో నల్గొండ డిపో పరిధిలో రూ.50.98 లక్షలు, మిర్యాలగూడలో రూ.46.41 లక్షలు, సూర్యాపేటలో రూ.34.37 లక్షల ఆదాయం సమకూరింది. అయినప్పటికీ అధికారులు లాజిస్టిక్స్ కేంద్రాలను ప్రైవేట్‌కు అప్పగించడంలో ఆంతర్యం ఏమిటని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

నూతనంగా టెండర్ల ఆహ్వానం..

ఉమ్మడి జిల్లాలోని యాదగిరిగుట్ట డిపోతో పాటు భువనగిరి బస్టాండ్, దేవరకొండ, నార్కట్‌పల్లి డిపోలలోని కార్గో కార్యాలయాలను ఏడు నెలల క్రితమే ప్రైవేట్ ఏజెంట్లకు అప్పగించిన అధికారులు.. ఐదు నెలల క్రితం కోదాడ డిపోలోని కార్యాలయాన్ని సైతం ఏజెంటుకు అప్పగించారు. కాగా ఆదాయం ఆశాజనకంగా ఉన్న నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట డిపోల్లోని లాజిస్టిక్స్ కార్యాలయాలను మాత్రం ఆర్టీసీ నిర్వహిస్తుంది. త్వరలోనే వీటిని సైతం ప్రైవేట్‌కు అప్పగించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆ నేపథ్యంలోనే ఔత్సాహికులైన ఏజెంట్ల నుంచి టెండర్లు సైతం ఆహ్వానించారు. ప్రైవేట్ ఏజెంట్లకు అప్పగించిన కేంద్రాల్లో ఆర్టీసీ నుంచి కేవలం మార్కెటింగ్ అధికారి మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన సిబ్బంది మొత్తం ప్రైవేట్ వారే విధులు నిర్వర్తిస్తున్నారు. మిర్యాలగూడ, నల్గొండ డిపోలలో ఆరుగురు చొప్పున ఆర్టీసీ, పొరుగు సేవల సిబ్బంది, సూర్యాపేట డిపోలో ఐదుగురు చొప్పున ఆర్టీసీ, పొరుగు సేవల సిబ్బంది పని చేస్తున్నారు.

ఆదాయంలో వాటాతోనే సరి..

లాజిస్టిక్స్ కేంద్రాలను ప్రైవేట్ ఏజెంట్లకు 12 శాతం కమీషన్ పద్ధతిలోనే అప్పగిస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు కార్యాలయం అద్దెతో పాటు పార్శిళ్ల ద్వారా వచ్చిన ఆదాయంలోనూ ఆర్టీసీకి వాటా వస్తుందంటున్నారు. ఇక సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన కార్గోలో నియమించలేదని..కరోనా అనంతరం సిబ్బంది మొత్తానికి విధులు కేటాయించడంలో భాగంగా పలువురిని కార్గోలో నియమించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వంద శాతం పైగా బస్సులు నడపడంతో సిబ్బందికి తిరిగి వారి విధులు కేటాయిస్తున్నామని, దీంతో కార్గో కేంద్రాలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నామంటున్నారు. గతంలో కంటే ప్రైవేట్ ఆధ్వర్యంలోనే ఆదాయం పెరిగిందని సైతం చెబుతున్నారు.

ఖర్చు తగ్గించుకునేందుకే..

సంస్థ నిర్ణయం మేరకే ఆదాయం తక్కువగా వస్తున్న లాజిస్టిక్స్ కేంద్రాలను గతంలోనే ప్రైవేట్ ఏజెంట్లకు అప్పగించినట్లు అధికారులు చెబుతున్నారు. లాజిస్టిక్స్ నిర్వహణలో ఖర్చు తగ్గించుకునే క్రమంలో రాష్ట్ర వ్యాప్త కార్యాచరణలో భాగంగా రీజియన్ పరిధిలోని మిగిలిన కేంద్రాలను సైతం ప్రైవేట్ ఏజెంట్లకు అప్పగించేందుకు టెండర్లు ఆహ్వానించామని.. ఆర్టీసీ సిబ్బందిని కార్గో కార్యాలయాల్లో తాత్కాలిక ప్రాతిపదికనే నియమించాం. ప్రస్తుతం బస్సులు పూర్తి స్థాయిలో నడుస్తున్నందున సిబ్బందిని తిరిగి వారి పాత స్థానాల్లోకి పంపించనున్నట్లు లాజిస్టిక్స్ అధికారులు స్పష్టం చేశారు.

# హిందూపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో అనేక సమస్యలు...




శ్రీసత్యసాయి జిల్లా: టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ గురువారం హిందూపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవని రోగులు బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా: టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ గురువారం హిందూపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవని రోగులు బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలకృష్ణ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో అనేక సమస్యలు ఉన్నాయని, వైద్య పరికరాలు లేవని, ఉన్న వాటిని వాడుకోలేదని విమర్శించారు. గతంలో తాను ఇచ్చిన వెంటిలేటర్లు నిరుపయోగంగా ఉన్నాయని, టీడీపీ హయాంలో ఆస్పత్రి శుభ్రంగా ఉండేదని, ఇప్పుడు అలా లేదని బాలకృష్ణ అన్నారు. కనీసం సీలింగ్ కూడా సరిగా లేదని, ఇవాళ ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తామని ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాలు అంటున్నాయన్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ కింద ఇచ్చిన నిధులను కూడా వేరే స్కీమ్‌లకు డైవర్ట్ చేశారన్నారు. 460 కోట్ల రూపాయలను ఏపీ ప్రభుత్వం వేరే స్కీమ్‌లకు తరలించిందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం ఫైన్ కూడా కట్టిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు శాశ్వత పరిష్కారం ఇంకో 4 నెలల్లో వస్తుందని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు.

# 'చంద్రబాబు పెద్ద కట్టప్ప.. నాదెండ్ల మనోహర్ చిన్న కట్టప్ప'



విశాఖపట్నం: ఏపీ ప్రతిపక్ష పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు మంత్రి గుడివాడ అమర్నాథ్. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను నాదెండ్ల భాస్కర్ చదువుతున్నారు. చంద్రబాబు పెద్ద కట్టప్ప అయితే, నాదెండ్ల భాస్కర్ చిన్న కట్టప్ప అని సెటైరికల్ కామెంట్స్ చేశారు. కాగా, గుడివాడ అమర్నాథ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..'పవన్‌తో పాటు, నాదెండ్ల మనోహర్ కూడా ప్రజలను తప్పు దోవపట్టిస్తున్నారు. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిస్తే.. పవన్ కల్యాణ్‌కు మనోహర్ వెన్నుపోటు పొడుస్తున్నారు. చంద్రబాబు పెద్ద కట్టప్ప అయితే.. మనోహర్ చిన్న కట్టప్ప. టీడీపీ పాలనలో జీఎస్‌డీపీ 22వ స్థానంలో ఉంది. నేడు జీఎస్‌డీపీ ఒకటో స్థానంలో ఉంది. జీఎస్‌డీపీ అనేది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చింది. తలసరి ఆదాయం టీడీపీ హయాంలో 174వ స్థానంలో ఉండగా.. నేడు తొమ్మిదో స్థానంలో ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పరిశ్రమల ద్వారా లక్ష 30 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. %మీవీజు% ద్వారా 13 లక్షల మందికి ఉపాధి కల్పించాం. టీడీపీ పాలనలో వ్యవసాయం రంగంలో 27 స్థానంలో ఉన్నాము. నేడు ఆరో స్థానంలో రాష్ట్రం ఉంది. పారిశ్రామిక అభివృద్ధిలో టీడీపీ హయాంలో 22వ స్థానంలో ఉంటే నేడు మూడో స్థానంలో ఉంది. గుజరాత్ తరువాత మన రాష్ట్రంలో పెట్టుబడులు అధికంగా వచ్చాయి. ఈజ్ ఆఫ్ డుయింగ్‌లో గత మూడేళ్ల నుంచి రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఎంఎస్ఎంఈకి పెద్ద పీట వేశారు. గత ప్రభుత్వం కన్నా ఎంఎస్ఎంఈ రంగంలో 650 శాతం అభివృద్ధి సాధించింది. మొన్న జరిగిన క్యాబినెట్ మీటింగులో 20 వేల కోట్ల పెట్టుబడులకు సీఎం జగన్ క్లియరెన్స్ ఇచ్చారు. ఉన్న ఆరు పోర్టులకు అదనంగా మరో నాలుగు పోర్టులు నిర్మిస్తున్నారు. 10 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నాం. పోర్ట్ ఆధారిత పరిశ్రమలు తీసుకువస్తున్నాము. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు మన రాష్ట్రంలో ఉన్నాయి. బల్క్ డ్రగ్ పార్క్‌ను నిర్మిస్తున్నాం' అని కామెంట్స్ చేశారు.

# మంత్రులను అడ్డుకున్న స్థానికులు.. దొమ్మేరులో ఉద్రిక్తత





దొమ్మేరు: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫ్లెక్సీ వివాదంలో పోలీసుల వేధింపులకు తీవ్ర మనస్తాపానికి గురైన ఎస్సీ యువకుడు మహేంద్ర ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు హోంమంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, కలెక్టర్, డీఐజీ గ్రామానికి రాగా.. స్థానికులు, మృతుడి స్నేహితులు మంత్రులను అడ్డుకున్నారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ గ్రామస్తులు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాదాపు అరగంట పాటు మంత్రులు గ్రామం వెలుపలే వేచి ఉండాల్సి వచ్చింది. క్రమంలో పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట జరిగింది. ఆందోళన కారులను చెదరగొట్టిన పోలీసులు.. మంత్రులను మహేంద్ర ఇంటి వద్దకు అతికష్టం మీద తీసుకొచ్చారు. పోలీసుల చర్యల వల్లే మహేంద్ర చనిపోయాడని గ్రామస్తులు ఆరోపించారు. హోం మంత్రి తానేటి వనిత విజయం కోసం మహేంద్ర పనిచేశాడని, పోలీసులు నిర్బంధించారంటే హోం మంత్రి పట్టించుకోలేదని, ఆమె దృష్టికి తీసుకెళ్లినా ఒక్క ఫోన్ కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల్లో తానేటి వనిత ఎలా గెలుస్తారో చూస్తామంటూ మృతుడి బంధువుల శాపనార్థాలు పెట్టారు.
**వెలుగులోకి మహేంద్ర వాంగ్మూలం..** ఫ్లెక్సీ వివాదంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న మహేంద్ర వాంగ్మూలం వెలుగులోకి వచ్చింది. తన చావుకు కారణం కొవ్వూరు స్టేషన్ ఎస్ఐ భూషణం, వైకాపా నాయకులు నాగరాజు, సతీష్ అని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహేంద్ర కోరాడు.

# అప్పులు చేస్తున్నా రాష్ట్రంలో అభివృద్ధి లేదు..



గుంటూరు: కేంద్రం పెద్ద ఎత్తున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాయం చేస్తోంది.. సీఎం జగన్ అప్పులు చేస్తున్నా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరగడంలేదని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె గుంటూరులో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్జీ రంగా వర్సిటీలో పనులకు కేంద్రం నిధులు ఇచ్చిందని వర్సిటీ భవనాలకు, పరిశోధనలకు కేంద్రం నిధులు ఇచ్చిందని, అయినా ఎన్జీ రంగా వర్సిటీలో ఆశించిన స్థాయిలో పనులు జరగటం లేదని అన్నారు. ఎయిమ్స్‌కు కనీసం నీటి వసతి కూడా కల్పించలేదని, యడ్లపాడు స్పైస్ పార్కు అభివృద్ధి ఆగిపోయిందని పురందేశ్వరి విమర్శించారు.

# కోడికత్తి గాయానికి జగన్ హైదరాబాద్ వెళ్లలేదా.. సజ్జలా?




అమరావతి: టీడీపీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు. గురువారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ సైకో పాలనలో సత్యం మరుగున పడటం.. అసత్యం అందలం ఎక్కడం, సజ్జల లాంటి వ్యక్తి అసత్యాలు చెప్పడం పెద్ద విచిత్రమేమీ కాదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హైకోర్టు ఆదేశాలు, బెయిల్ నిబంధనలు గౌరవిస్తూ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యానే, సంయమనంతో ఉంటున్నారని సకల శాఖల సలహాదారు గ్రహించాలన్నారు. చంద్రబాబుకు బెయిల్ రావడం జగన్ రెడ్డికి.. సజ్జలకు ఇష్టం లేదని వారి మాటలే చెబుతున్నాయన్నారు. పద్మవిభూషణ్ గ్రహీత నాగేశ్వర్ రెడ్డిని.. ఏఐజీ ఆసుపత్రిని తప్పుపట్టే స్థాయి.. చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత సజ్జల రామకృష్ణారెడ్డికి లేవని అశోక్‌బాబు అన్నారు. చంద్రబాబు బెయిల్ విషయంలో హైకోర్టు నిబంధనలు తెలుసుకునే సజ్జల మాట్లాడారా? అని ప్రశ్నించారు. ఎలాంటి ప్రత్యేకత ఉందని జగన్ రెడ్డి తనపై ఉన్న అవినీతికేసుల విచారణకు హాజరుకావడం లేదో సజ్జల చెప్పాలన్నారు. కోడికత్తి గాయానికి ఆంధ్రాలో వైద్యం చేసేవారు లేరని ఆనాడు జగన్ హైదరాబాద్‌కు వెళ్లారా సజ్జలా? అని నిలదీశారు. బాబాయ్ హత్యకేసు నుంచి అవినాశ్ రెడ్డిని.. కోడికత్తి కేసు నుంచి తనను రక్షించుకోవడానికి జగన్ రెడ్డి ఆడుతున్న నాటకాలు ఎన్నాళ్లు కప్పిపుచ్చుతారు సజ్జలా? అంటూ అశోక్‌బాబు వ్యాఖ్యానించారు.

# దేశంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం తెలంగాణ: పి.చిదంబరం



హైదరాబాద్: కేసీఆర్ సర్కారు అన్ని రంగాల్లో విఫలమైందని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఆరోపించారు. తెలంగాణతో తనకు 2008 నుంచి అనుబంధం ఉందని తెలిపారు. దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణం తెలంగాణలోనే ఉందన్నారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం బాగా పెరిగింది. ఇది జాతీయ సగటు కన్నా ఎక్కువ. నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలూ ఎక్కువగానే ఉన్నాయి.. వ్యాట్ ఎక్కువగా వసూలు చేస్తోంది తెలంగాణలోనే. నిరుద్యోగ రేటు 7.8 (పురుషులు), 9.5 (మహిళలు)గా ఉంది. గ్రామీణ నిరుద్యోగ రేటు జాతీయ సగటు కన్నా తెలంగాణలో అధికంగా ఉంది. రాష్ట్రంలో 1.91 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 20 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయలేదు. టీఎస్‌పీఎస్సీలో 22 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్టర్ అయ్యారు. వారికి నిరుద్యోగ భృతి చెల్లించడంలో సర్కారు విఫలమైంది. రాష్ట్ర అప్పులు రూ.3.66 లక్షల కోట్లకు పెరిగాయి. దీంతో సంక్షేమ పథకాల అమలు కష్టంగా మారింది. విద్య, వైద్యానికి కేటాయింపులు దారుణంగా పడిపోయాయి. పోషకాహార లోపం తీవ్రంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలి. మాకు అవకాశం ఇస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం" అని చిదంబరం అన్నారు.




రెండోదశ పోలింగ్‌కు సిద్ధమైన ఛత్తీస్‌గఢ్‌లో ప్రధాన రాజకీయ పార్టీలు తమ విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. 70 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 17న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో బిలాస్‌పూర్ డివిజన్‌పైనే అన్ని పార్టీల కళ్లు కేంద్రీకృతమయ్యాయి. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలుండగా.. ఇందులో 25వరకు ఈ డివిజన్ పరిధిలోనే ఉండటం గమనార్హం. రాష్ట్ర రాజకీయ వేదికపై 'విజేత'ను నిర్ణయించే ఈ బెల్ట్‌పైనే ప్రధాన రాజకీయ పార్టీలు ఆశలు పెట్టుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఐదు పరిపాలనా డివిజన్లు ఉండగా.. అందులో బిలాస్‌పూర్ డివిజన్ సెంట్రల్ రీజియన్‌లో ఉంది. ఈ బెల్టు పరిధిలోనే అత్యధికంగా 25 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈసారి ఎన్నికల్లో విజేతను నిర్ణయించడంలో ఇవి కీలక పాత్రను పోషించనున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 90 స్థానాల్లో 68చోట్ల ఘన విజయం సాధించిన కాంగ్రెస్.. ఈ డివిజన్‌ను మాత్రం స్వీప్ చేయలేకపోయింది. కేవలం 15 స్థానాలకే పరిమితమైన భాజపా మాత్రం.. ఈ ఒక్క డివిజన్‌లోనే ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. బీఎస్పీ రెండు, దివంగత అజిత్ జోగి స్థాపించిన జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జేసీసీ) మూడు స్థానాల్లో విజయం సాధించింది. గతంలో ఈ డివిజన్‌లో 24 స్థానాలు ఉండగా కాంగ్రెస్ 12 స్థానాల్లో విజయం సాధించింది. తాజాగా మరో డివిజన్‌కు చెందిన సీట్‌ను బిలాస్‌పూర్ డివిజన్‌లో కలపడంతో ఇక్కడ సీట్ల సంఖ్య 25కు పెరిగింది.
**అగ్రనేతలు రంగంలోకి..** ఈ బెల్టులో ఉన్న 25 నియోజకవర్గాలు ఎనిమిది జిల్లాల పరిధిలోకి వస్తాయి. ఇందులో ఐదు అసెంబ్లీ స్థానాలు ఎస్టీ, మరో ఐదు ఎస్సీ రిజర్వు స్థానాలుగా ఉన్నాయి. ఎన్నికల్లో మెజార్టీ మార్కును సాధించడంలో దోహదం చేసే ఈ డివిజన్‌పైనే ప్రధాన పార్టీలు కన్నేశాయి. రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాలను ఆకర్షించే ప్రయత్నం చేసిన భాజపా, కాంగ్రెస్ పార్టీలు తమ అగ్రనేతలను రంగంలోకి దింపాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్, ప్రియాంకా గాంధీలు ముమ్మర ప్రచారం చేశారు. మరోవైపు బీఎస్పీ మాత్రం గోండ్వానా గణతంత్ర పార్టీ (జీజీపీ)తో కలిపి పోటీ చేస్తుండగా.. అటు ఆమ్‌ఆద్మీ పార్టీ కూడా బరిలో నిలిచింది. జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జేసీసీ) కూడా పలుచోట్ల పోటీ ఇవ్వనుంది.
**విజయంపై ధీమా..** ఈసారి ఈ డివిజన్ నుంచి 20 స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తామని అంతర్గత సర్వేల్లో తేలినట్లు బిలాస్‌పూర్ ఎంపీ, రాష్ట్ర భాజపా అధ్యక్షుడు అరుణ్ సావో పేర్కొన్నారు. ఇక్కడి లోర్మీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీలో ఉన్న ఆయన.. ఈ డివిజన్‌లో తాము సీనియర్లతోపాటు కొత్తవారిని బరిలో దించామన్నారు. జంజ్‌గిర్-చాంపా నుంచి విపక్ష నేత నారాయణ్ చందేల్ పోటీ చేస్తుండగా.. మాజీ ఐఏఎస్ అధికారి ఓపీ చౌధరీ రాయ్‌గఢ్ స్థానం నుంచి బరిలో ఉన్నారు. వీరితోపాటు భాజపా సీనియర్ నేత దిలీప్‌సింగ్ జుదేవ్ కుటుంబం నుంచి ఇద్దరు నేతలు ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు. అధికారానికి చేరువ చేయడంలో కీలకంగా ఉన్న ఈ డివిజన్‌లో క్రితం ఎన్నికల్లో ఊహించిన ఫలితాలు రాలేదని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో ముమ్మర ప్రచారం చేయించి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేసింది.
**రైతులపై దృష్టి..** వ్యవసాయ ఆధారిత కేంద్రంగా బిలాస్‌పూర్ ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరికి మద్దతు ధర కల్పిస్తోంది. ఎన్‌వైఏవై పథకం కింద క్వింటాలుకు రూ.2600 ధరతో ధాన్యం సేకరిస్తుండగా.. మళ్లీ అధికారంలోకి వచ్చాక దీన్ని రూ.3200 పెంచుతామని ఎన్నికల ప్రచారంలో ప్రకటించింది. దీంతోపాటు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అటు ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ ఛరిష్మా కూడా కాంగ్రెస్ పార్టీకి కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. ఈ డివిజన్‌లో ద్విముఖ పోరు ఉంటుందని భాజపా, కాంగ్రెస్‌లు పేర్కొంటున్నప్పటికీ.. జేసీసీ, బీఎస్పీ పార్టీల ప్రభావం కూడా ఉంటుందని అంచనా. అయితే, జేసీసీకి చెందిన 95శాతం మంది నేతలు తమ పార్టీలో చేరిపోయారని కాంగ్రెస్ నేత, బిలాస్‌పూర్ ఎమ్మెల్యే శైలేష్ పాండే పేర్కొన్నారు. అసెంబ్లీ స్పీకర్ చరణ్‌దాస్ మహంత్, రాష్ట్ర మంత్రులు ఉమేశ్ పటేల్, జైసింగ్ అగర్వాల్ వంటి అధికార పార్టీ నేతలు పోటీలో ఉన్నారు.

# తాడేపల్లి ప్యాలెస్‌లో సజ్జల ఎలాగో.. తితిదేలో ధర్మారెడ్డి అలాగే: ఆనం వెంకటరమణారెడ్డి



అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం అధికార పార్టీ నేతల అవినీతికి అడ్డాగా మారిందని తెదేపా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణా రెడ్డి ధ్వజమెత్తారు. భూమన కరుణాకరరెడ్డి తితిదే చైర్మన్ అయ్యాక.. దేవస్థానం డబ్బుల్ని తన కుమారుడు అభినయ్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆనం మాట్లాడారు. తిరుపతి పరిధిలో ఏ పనికైనా 10 శాతం లంచం తీసుకుంటున్న భూమన కరుణాకరరెడ్డిని ఇప్పటికే 10 శాతం కరుణాకరరెడ్డిగా పిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. తితిదే ఉద్యోగులకు కేటాయించిన స్థలాల చుట్టూ అభినయ్‌రెడ్డి 5.45 ఎకరాలు ఎలా కొనుగోలు చేశారో సమాధానం చెప్పాలని ఆనం డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి సొమ్ము తిన్న ప్రతి రూపాయినీ తెలుగుదేశం అధికారంలోకి రాగానే కక్కిస్తామని ఆనం హెచ్చరించారు. తాడేపల్లి ప్యాలెస్‌లో సజ్జల ఎలాగో తితిదేలో ధర్మారెడ్డి వ్యవహారం అలాగే ఉందని విమర్శించారు. ధర్మారెడ్డి అవినీతిపై 14 సెక్షన్ల కింద దిల్లీలో గతంలో క్రిమినల్ కేసు నమోదైందన్నారు. ఆ కేసుని దాచిపెట్టి ఆయన తితిదే ఈవో అయ్యారని.. అదే అవినీతి ఇప్పుడు తితిదేలో చేయరనే నమ్మకమేంటని నిలదీశారు. క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తికి తితిదేలో కీలక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తితిదేని అడ్డుపెట్టుకుని దిల్లీలో ధర్మారెడ్డి లాబీయింగ్ చేస్తున్నారని ఆరోపించారు. దిల్లీలో నమోదైన కేసుపై తీర్పు వచ్చే వరకు ధర్మారెడ్డిని తితిదే బాధ్యతల నుంచి తప్పించాలని ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.

# సిలిండర్‌పై రూ.450 రాయితీ.. విద్యార్థినులకు ఉచిత స్కూటీ: భాజపా



జైపూర్: రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, పేపర్ లీకులకు పేరుపొందిందని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. ఇక్కడి ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకుంటున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 'సంకల్ప్ పత్ర్' పేరిట రూపొందించిన పార్టీ మ్యానిఫెస్టో గురువారం ఆయన జైపూర్‌లో విడుదల చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పేపర్ లీకులు, అనేక పథకాల్లో అవినీతిపై విచారణకుగానూ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి జిల్లాకు మహిళా పోలీస్ స్టేషన్, ప్రతి ఠాణాలో మహిళా డెస్కులను ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా ప్రముఖ పట్టణాల్లో 'యాంటీ రోమియో స్క్వాడ్'లు నియమిస్తామని చెప్పారు. ఆడపిల్ల పుడితే రూ.2 లక్షల పొదుపు బాండ్‌ను జమచేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా.. రాజస్థాన్‌లో ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. డిసెంబరు 3న ఫలితాలు వెల్లడి కానున్నాయి. కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలో ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారిపోయే సంప్రదాయాన్ని తిరగరాసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. అవినీతి, కుంభకోణాల పేరిట అధికార కాంగ్రెస్‌ను భాజపా లక్ష్యంగా చేసుకుంది.
**ఇతర కీలక హామీలు..** 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద రైతులకు ఏటా అందించే ఆర్థిక సాయం రూ.12 వేలకు పెంపు, గ్యాస్ సిలిండర్‌పై రూ.450 చొప్పున రాయితీ, వచ్చే ఐదేళ్లలో 2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 15 వేల వైద్యుల నియామకం, 12వ తరగతి పాసైన ప్రతిభ గల విద్యార్థినులకు ఉచిత స్కూటీ, క్వింటాలుకు రూ.2700 చొప్పున గోధుమల కొనుగోలు.




శాన్ ఫ్రాన్సిస్కో: నిత్యం బిజీగా ఉండే దేశాధినేతలు ఒక్కోసారి వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయకతప్పదు. వారు కుటుంబానికి తగిన సమయం కేటాయించలేకపోవచ్చు. చైనా అధినేత షీ జిన్‌పింగ్ కూడా అలాగే తన సతీమణి పుట్టినరోజును మర్చిపోయారట..! అయితే, ఆమె బర్త్‌డే గురించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గుర్తుచేయడమే గాక.. ఓ బహుమతి తీసుకెళ్లాలని జిన్‌పింగ్‌కు సూచించారు. అమెరికాలో పర్యటిస్తున్న షీ జిన్‌పింగ్.. అగ్రరాజ్య అధినేత జో బైడెన్‌తో ముఖాముఖీగా సమావేశమైన విషయం తెలిసిందే. ఈ భేటీలో దేశాధినేతల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. నవంబరు 20న బైడెన్ తన 81వ పుట్టినరోజును చేసుకోనున్నారు. అదే రోజున జిన్‌పింగ్ సతీమణి పెంగ్ లియువాన్ పుట్టిన రోజు కూడా..! తాజాగా జరిగిన సమావేశంలో బైడెన్ ఆ విషయాన్ని గుర్తుచేస్తూ.. పెంగ్‌కు తన తరఫున శుభాకాంక్షలు తెలపాలని జిన్‌పింగ్‌కు చెప్పారు. అయితే, సతీమణి పుట్టినరోజును మర్చిపోయిన జిన్‌పింగ్ ఆ క్షణంలో ఒకింత ఇబ్బందికి గురయ్యారట. "ఈ బాధ్యతల్లో పడి నేను ఆ తేదీనే మర్చిపోయా. ఆమె పుట్టిన రోజును గుర్తుచేసినందుకు కృతజ్ఞతలు. ఆమె కోసం ఏదైనా తీసుకెళ్లేందుకు సీరియస్‌గా ప్రయత్నిస్తా" అని జిన్‌పింగ్ చెప్పినట్లు యూఎస్ అధికారులు వెల్లడించారు. అటు సమావేశం తర్వాత బైడెన్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. "జిన్‌పింగ్‌తో నా బంధం చాలా లోతైనది. ప్రపంచంలోని ఇతర నేతలకంటే చైనా అధ్యక్షుడితోనే నేను ఎక్కువ సమయం గడిపా. మా దేశాలకు ఉపాధ్యక్షులుగా ఉన్ననాటి నుంచే మేం సమావేశాల్లో పాల్గొన్నాం. ఆయన కార్యనిర్వహణ శైలి గురించి నాకు బాగా తెలుసు. ఇప్పుడు ఆయనకు ఓ బర్త్‌డే కార్డు (పెంగ్ పుట్టినరోజును ఉద్దేశహస్తూ) కొనాలని గుర్తుచేశా" అని బైడెన్ తెలిపారు. షీ జిన్‌పింగ్‌కు తొలుత కె లింగ్‌లింగ్‌తో వివాహమైంది. అయితే కొన్ని కారణాలతో వారు 1982లో విడిపోయారు. ఆ తర్వాత ప్రముఖ జానపద గాయని అయిన పెంగ్ లియువాన్‌ను 1987లో వివాహం చేసుకున్నారు. వీరిద్దరికీ ఓ కుమార్తె ఉంది. చైనా గత అధ్యక్షుల సతీమణులతో పోలిస్తే.. దేశ ప్రథమ మహిళగా పెంగ్ అనేక సార్లు మీడియాలో కన్పించారు. 2014లో అప్పటి అమెరికా ప్రథమ మహిళ మిషెల్ ఒబామా బీజింగ్ పర్యటనకు వచ్చినప్పుడు.. ఆమెకు పెంగ్ ప్రత్యేక ఆతిథ్యమిచ్చారు.

# డిమాండ్ క్యాష్ చేసుకుంటున్న బ్యూటీ..!

రెండు దశాబ్దాలుగా సౌత్ ఆడియన్స్ ని అలరిస్తూ వస్తున్న చెన్నై చిన్నది త్రిషా కృష్ణన్ మధ్యలో కొంత ఫాం కోల్పోయినట్టు కనిపించినా 96 సినిమాతో తిరిగి ఫాంలోకి వచ్చింది. కెరీర్ దాదాపు అయిపోయింది అనుకున్న వారందరికీ ఆమె మళ్లీ వరుస సినిమాలతో సత్తా చాటింది. ఇక పి.ఎస్ 1, 2 సినిమాలతో త్రిష మరోసారి తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఇక రీసెంట్ గా వచ్చిన దళపతి విజయ్ లియో సినిమాలో కూడా త్రిష తన లుక్స్ తో ఆకట్టుకుంది. పాత్ర పరంగా నిడివి తక్కువగానే ఉన్నా సరే త్రిష కనిపించినంత సేపు అట్రాక్టివ్ గా అనిపించింది. వయసు పెరుగుతున్నా కొద్దీ అమ్మడిలో అందం రెట్టింపు అవుతుంది అన్నట్టుగా త్రిష గ్లామర్ రోజు రోజుకి పెరుగుతుంది. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చినా నేటి తరం యువ హీరోయిన్స్ కి ఏమాత్రం తీసిపోని విధంగా అమ్మడి లుక్స్ ఉన్నాయి. లియో హిట్ తో మరోసారి టాక్ ఆఫ్ ది



టౌన్ గా మారిన త్రిష వరుస అవకాశాలతో అదరగొట్టేస్తుంది. కోలీవుడ్ లో ప్రస్తుతం కమల్ 234 సినిమాలో ఛాన్స్ అందుకున్న అమ్మడు అజిత్ కుమార్ హీరోగా వస్తున్న విడా ముయార్చి లో కూడా నటిస్తుంది. కెరీర్ సూపర్ స్ట్రాంగ్ గా కొనసాగుతున్న టైం లో డిమాండ్ ని బట్టి క్యాష్ చేసుకోవాలని అనుకుంటుంది. అందుకే నిన్న మొన్నటిదాకా 2, 3 కోట్ల దాకా రెమ్యునరేషన్ అందుకున్న త్రిష రాబోయే సినిమాలకు 10 కోట్ల దాకా రెమ్యునరేషన్ ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేస్తుందట. తనని హీరోయిన్ గా తీసుకోవాలనుకునే వారికి రెమ్యునరేషన్ తో షాక్ ఇస్తుంది అమ్మడు. తెలుగులో కూడా ఒకటి రెండు అవకాశాలు వచ్చినా ఇలా రెమ్యునరేషన్ ఎక్కువ అడగడం వల్లే ఆ అవకాశాలు చేజారాయని తెలుస్తుంది. అయితే త్రిష ప్రస్తుత లుక్స్ ఆడియన్స్ ని ఆకట్టుకుంటున్నాయి. మరి అలాంటి అందాల భామని తీసుకోవాలంటే ఆమె అడిగినంత ఇవ్వాల్సిందే. టాలీవుడ్ లో మెగాస్టార్ చిరంజీవి సినిమాలో త్రిష డిస్కషన్స్ లో ఉందని వార్తలు వచ్చాయి. మెగా 156 లో త్రిష కాదు అనుష్క ఫైనల్ అయ్యిందని తెలిసిందే. అయితే బాలకృష్ణ కె.ఎస్ బాబీ డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో మాత్రం త్రిష ని సెలెక్ట్ చేసినట్టు టాక్. ఆ విషయంపై మరికొద్ది రోజుల్లో క్లారిటీ వస్తుంది.

## సుశాంత్ ని జీవితాంతం మిస్ అవుతూనే ఉంటాను

బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో సుశాంత్ సింగ్ రాజ్ పూత్ మరణించి మూడేళ్లు కావస్తుంది. ఈ మూడు సంవత్సరాల్లో ఆయన గురించి రెగ్యులర్ గా ఏదో ఒక విషయమై చర్చ జరుగుతూనే ఉంది. ముఖ్యంగా సుశాంత్ సింగ్ రాజ్ పూత్ ప్రియురాలిగా పేరున్న రియా చక్రవర్తి గురించి రెగ్యులర్ గా ఏదో ఒక వార్త మీడియాలో ప్రచారం జరుగుతూనే ఉండటం మనం చూస్తున్నాం. ముఖ్యంగా సుశాంత్ చనిపోయిన సమయం లోనే రియా చక్రవర్తి డ్రగ్స్ కేసులో అరెస్ట్ అవ్వడం.. జైలుకు వెళ్లడం వంటివి జరిగింది. హీరోయిన్ గా కెరీర్ లో అప్పుడప్పుడే నిలదొక్కుకుంటూ ఉన్న హీరోయిన్ రియా



చక్రవర్తికి కెరీర్ లో పెద్ద డ్యామేజ్ గా సుశాంత్ మరణం నిలిచింది అనడంలో సందేహం లేదు. సుశాంత్ మరణం కు పూర్తిగా రియా చక్రవర్తి కారణం అన్నట్టుగా చాలా మంది ఆరోపించారు. ఆ సమయం లో రియా చక్రవర్తి కనీసం బయటకు కూడా రాలేక పోయింది. సుశాంత్ చనిపోయిన చాలా రోజుల తర్వాత రియా మళ్లీ సోషల్ మీడియాలో తన ఫోటోలు షేర్ చేయడం మొదలు పెట్టింది. అంతే కాకుండా ఆమె సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చింది. తాజాగా రియా చక్రవర్తి ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సుశాంత్ గురించి స్పందించింది. నా జీవితంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తిని కోల్పోయాను. ఆ బాధ నుంచి నేను జీవితాంతం బయటకు రాలేను. సుశాంత్ ని నేను జీవితాంతం మిస్ అవుతూనే ఉంటాను. సుశాంత్ చనిపోయిన సమయంలో చాలా కథనాలు వచ్చాయి. వాటి వల్ల నేను చాలా మిస్ అయ్యాను. కనీసం నేను ఏడవడానికి కూడా సమయం ఇవ్వకుండా విమర్శలు చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నో సంఘర్షణలు ఎదుర్కొంటూ వచ్చాను. మళ్లీ సాధారణ స్థితికి రావడానికి చాలా సమయం పడుతుందని నాకు తెలుసు. ఈ సమయంలో నాకు ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్న ఆదర్శం. ఆయన ఎంత పెద్ద కష్టం వచ్చినా ఎదుర్కొని నిలవాలని చెప్పేవారు. ఆయన చెప్పినట్లుగానే తిరిగి సాధారణ స్థితికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. హీరోయిన్ గా రియా చక్రవర్తి పూర్వ వైభవం సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. మరి అది ఎంత వరకు వర్కౌట్ అయ్యేనో చూడాలి.




# రణబీర్ నోట బాలయ్య డైలాగ్



నందమూరి బాలకృష్ణ హోస్ట్ గా చేస్తున్న సూపర్‌హిట్ టాక్ షో "అన్‌స్టాపబుల్" కోసం ఇప్పుడు కేవలం సౌత్ ఆడియెన్స్ మాత్రమే కాకుండా బాలీవుడ్ జనాలు కూడా గట్టిగానే ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే రణబీర్ కపూర్ వంటి అతిపెద్ద సూపర్‌స్టార్ బాలయ్య తో సందడి చేయడంతో ఆ మూమెంట్స్ కోసం హార్డ్ కోర్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఉన్నారు. రణబీర్ తో పాటు హీరోయిన్ రష్మిక మందన్న అలాగే దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వారి తాజా చిత్రం "యానిమల్" ప్రమోషన్ కోసం ఈ షోలో అడుగు పెట్టారు. ఇటీవల షోకు సంబంధించిన షూటింగ్ మొత్తం కూడా ఫినిష్ అయ్యింది. ఇక ఎపిసోడ్ స్ట్రీమింగ్ కంటే ముందే లీక్స్ మొదలయ్యాయి. ఇప్పటికే కొన్ని ఫొటోలు రిలీజ్ అయ్యాయి. అందులో రణబీర్ బాలకృష్ణ ఇద్దరు కూడా ఒకే ఫ్రేమ్ లో కనిపించిన విధానం ఆడియెన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంది. లేటెస్ట్ గా వచ్చిన లీక్స్ ప్రకారం.. రణబీర్ కపూర్ బాలయ్య బాబు పవర్ ఫుల్ డైలాగ్ ను కూడా చెప్పినట్లుగా తెలుస్తోంది. బాలకృష్ణ హిట్ డైలాగ్స్ లో ఒకటైన 'ఫ్లూటు జింక ముందు లేదు సింహం ముందు కాదు' అనే డైలాగ్ ను రణబీర్ చెబుతూ షోలోకి అడుగుపెట్టినట్లుగా తెలుస్తుంది. దీంతో ఒక్కసారిగా ఆడిటోరియం మొత్తం రీ సౌండ్ తో మారుమ్రోగిందట. ఈ డైలాగ్ తోనే షోలో మంచి కిక్కు వస్తుంది అని చూసినవారు చెబుతున్నారు. ఏది ఏమైనాప్పటికీ బాలీవుడ్ హీరో అలా బాలకృష్ణ డైలాగ్ చెబుతూ ఉంటే చూడడానికి చాలా బాగుంటుంది అని ఫ్యాన్స్ మరింత ఆత్రుతగా ఆ షో కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఇక యానిమల్ సినిమాపై కూడా అంచనాలు గట్టిగానే ఉన్నాయి. బాలీవుడ్ లోనే కాకుండా తెలుగులో కూడా ఈ సినిమాను గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే బ్రహ్మాస్త్ర సినిమాతో టాలీవుడ్ లో కూడా డీసెంట్ హిట్ అందుకున్నాడు రణబీర్ కపూర్.

అలాగే అతను ఆ సినిమా ప్రమోషన్స్ కోసం టాలీవుడ్ కు కూడా వచ్చాడు. ఇక ఇప్పుడు యానిమాల్ తో సౌత్ లో మరింత సాలీడ్ హిట్ అందుకోవాలి అని చూస్తున్నాడు. మరి సినిమా అంచనాలను అందుకునే విధంగా క్లిక్ అవుతుందో లేదో చూడాలి.

# సంక్రాంతి పోటీలో నలిగి పోయేది ఎవరో...!





ప్రతి ఏడాది సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాలు చిన్న హీరోల సినిమాలు విడుదల అవ్వడం కామన్. 2023 సంక్రాంతికి చిరంజీవి మరియు బాలయ్య లు పోటీ పడ్డ విషయం తెల్సిందే. తమిళ్ మూవీ వచ్చినా కూడా చిరు, బాలయ్య లు ఆ డబ్బింగ్ సినిమాను కనిపించకుండా చేశారు. ఇక 2024 సంక్రాంతి సినిమాల గురించి ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రభాస్ 'కల్కి' సినిమాను విడుదల చేయాలని భావించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా వచ్చే పరిస్థితి లేదు. దాంతో ఇతర సినిమాలు చాలానే సంక్రాంతి బరిలో దిగబోతున్నాయి. ఇప్పటికే మహేష్ బాబు గుంటూరు కారం సినిమా ను సంక్రాంతికి విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కచ్చితంగా సంక్రాంతికి త్రివిక్రమ్, మహేష్ బాబులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంక్రాంతికి నాగార్జున నటిస్తున్న 'నా సామిరంగా' సినిమా విడుదల కాబోతుంది.
లషూటింగ్ ప్రారంభం సమయంలోనే సంక్రాంతికి వచ్చి తీరుతాం అంటూ మేకర్స్ ప్రకటించడంతో కచ్చితంగా నాగ్ సినిమా సంక్రాంతికి వచ్చే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. తాజాగా సంక్రాంతికి విడుదల అవుతున్న సినిమాల జాబితాలో సైంధవ్ కూడా చేరింది. వెంకటేష్ హీరోగా నటిస్తున్న సైంధవ్ సినిమా ను సంక్రాంతి కానుకగా విడుదల చేయడం ద్వారా పోటీ మరింత రసవత్తరంగా మారబోతుంది. నాగార్జున మరియు వెంకటేష్ లు గతంలో బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డ సందర్భాలు ఉన్నాయి. అందులో ఎక్కువ శాతం వెంకటేష్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. అయితే ఈసారి వీరిద్దరితో పాటు మరి కొన్ని సినిమాలు కూడా రాబోతున్నాయి. సంక్రాంతికి ఇంకా మూడు నెలల సమయం ఉంది కనుక ఇప్పటికే కమిట్ అయిన సినిమాలు వాయిదా పడవచ్చు.. మరికొన్ని సినిమాలు వచ్చి చేరినా చేరవచ్చు. కనుక ఈ సంక్రాంతి పోటీలో హిట్ గా నిలిచే సినిమాలు ఏంటి... నలిగి పోయే సినిమాలు ఏంటి అనేది తెలియాలంటే మరి కొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందే.

# టాలీవుడ్ లో మిల్కీబ్యూటీ పరిస్థితి ఏంటి?

మిల్కీబ్యూటీ టాలీవుడ్ లో ఏ రేంజ్ లో చక్రం తిప్పిందో చెప్పాల్సిన పనిలేదు. సీనియర్ హీరోల నుంచి ఆ తర్వాత తరం నటులు.... యంగ్ హీరోల వరకూ అందరితో తెరను పంచుకుంది. 15 ఏళ్ల పాటు పరిశ్రమలో తిరుగులేని నాయికగా కొనసాగింది. ఇదే క్రమంలో ఇతర భాషల్లోనూ సినిమాలు చేసింది. అటుపై అవకాశాలు తగ్గడంతో ఐటం భామగానూ మారింది. బడ్జెట్ సినిమాల్లో సైతం నాయికగా నటించింది. మరి తాజాగా టాలీవుడ్ లో తమన్నా పరిస్థితి ఏంటి? ఆమె ఎన్ని సినిమాలు చేస్తుంది? అంటే చేతిలో తెలుగు అవకాశాలేవి లేనట్లే కనిపిస్తుంది. గడిచిన మూడేళ్లలో తమన్నా కేవలం రెండు..మూడు తెలుగు సినిమాలే చేసింది. 'ఎఫ్ -3' తర్వాత 'గుర్తుందా శీతాకాలం'..'భోళా శంకర్' చిత్రాల్లోనే నటించింది. హిందీ..తమిళ్ లో మాత్రం కొన్ని సినిమాలు చేసింది. మొత్తంగా



2022-23 లో తమన్నా మార్క్ ఏం కనిపించలేదనే చెప్పాలి. ఇక తమన్నా రూపంలో సైతం చాలా మార్పులొచ్చాయి. కొన్ని రకాల విమర్శలు కూడా తెరపైకి వస్తు న్నాయి. అలాగే విజయ్ వర్మతో డేటింగ్ లోనూ ఉంది. వివాహ బంధంతో ఓ ఇంటిది కాబోతుందని ప్రచారం సాగుతోంది. మరి ఇలాంటి తరుణంలో తమన్నా మళ్లీ తెలుగు సినిమాల్లో బౌన్స్ బ్యాక్ కాగలదా? అంటే అంత వీజీ కాదనే తెలుస్తోంది. తమన్నా ఇప్పుడా ఛరిష్మాని కోల్పోయిందనే విమర్శ వినిపిస్తుంది. కొత్త భామల నుంచి పోటీని తట్టుకునేందుకు ఇన్ స్టా వేదికగా రకరకాల జిమ్ములు ప్లే చేస్తున్నా! అవేవి మార్కెట్ లో వర్కౌట్ అవ్వడం లేదు. తమన్నా బ్యూటీని ఒకప్పుడు ఎంతగా ఆకాశానికి ఎత్తేసారో? ఇప్పుడదే స్థాయిలో విమర్శలు ఎక్కుపెడుతున్నాయి. సీనియర్ నాయికల్లో కొంత మంది తప్ప అందరూ బౌన్స్ బ్యాక్ కావడం కష్టమని నిపుణులు భావిస్తున్నారు. మరి తమన్నా ఆ ఎనాలసిస్ ని బ్రేక్ చేసి బౌన్స్ బ్యాక్ అవుతుందా? అన్నది చూడాలి.

## తగ్గేదే లే... మిల్కీ బ్యూటీ బికినీ షో

మిల్కీబ్యూటీ తమన్నా కెరీర్ ఆరంభించి దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతోంది. అయినా కూడా ఇప్పటికి ఏదో ఒక ప్రాజెక్ట్ తో బిజీగానే ఉంటోంది. సినిమాలు.. సిరీస్ లు.. ఐటెం సాంగ్స్.. చివరికి వీడియో ఆల్బం ల్లో కూడా తమన్నా కనిపిస్తూ తన అభిమానులకు కన్నుల విందు చేస్తుంది. స్కిన్ షో విషయం లో మిల్కీ బ్యూటీ అస్సలు తగ్గడం లేదు. తాజాగా మరోసారి తగ్గేదే లే అన్నట్లుగా తన అందాల ఆరబోత చేసింది. జైలర్ సినిమా తో పాటు ఇటీవల లస్ట్ స్టోరీస్ 2 లో కూడా మిల్కీ బ్యూటీ తమన్నా సంచలన అందాలను షో చేసింది. ఆ అందాల ఆరబోతకు ఫ్యాన్స్ తో పాటు అంతా కూడా షాక్ అయ్యారు. వయసు పెరుగుతున్నా కొద్ది మిల్కీ బ్యూటీ అందం పెరుగుతుందనే టాక్ వచ్చింది. తాజాగా బికినీతో మిల్కీ బ్యూటీ సర్



ప్రైజ్ చేసింది. ఒక ప్రముఖ బ్రాండ్ ప్రమోషన్ కోసం తమన్నా బికినీ ధరించింది. అందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో గతంలో పలు సార్లు బికినీతో సర్ ప్రైజ్ చేసిన మిల్కీ బ్యూటీ తమన్నా మరోసారి బికినీ అందాలతో కన్నుల విందు చేసింది. టూ పీస్ బికినీ లో మిల్కీ బ్యూటీ ఇంకా కూడా తన అందం ఏమాత్రం తగ్గలేదు.. నేను యంగ్ హీరోలకు జోడీగా సినిమాలు చేయగల సత్తా ఉన్న నటిని అన్నట్లుగా ధీమాతో చెప్పకనే చెప్పింది. మొత్తానికి మిల్కీ బ్యూటీ బికినీ షో తో మరో అయిదు పది సంవత్సరాల పాటు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశాలు ఉన్నాయి అన్నట్టుగా నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు.



## ప్రజల్లో చిచ్చుపెట్టి, అభివృద్ధి పట్టని పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి: మంత్రి సబిత

హైదరాబాద్: పల్లె ప్రగతితో పల్లెల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మంత్రి సబితా ఇంద్రారెడ్డి న్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించామని, హైదరాబాద్?లో ప్రజలు ఏ నీరు తాగుతున్నారో.. అదే నీరు మనమంతా తాగుతున్నామంటే ఆ ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రైతు బంధు, రైతు భీమా, కళ్యాణాలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు ఇస్తున్న సంక్షేమాల ప్రభుత్వానికి మద్దతు తెలపన్నారు. నియోజకవర్గమే తన ఇల్లని, ప్రజలే తన కుటుంబసభ్యులని చెప్పారు. ప్రజాసేవకే తన జీవితం అంకితమని తెలిపారు. కరోన వచ్చినా, వర్షాలు వచ్చి వరదలు వచ్చినా, ఏ కష్టం వచ్చినా ప్రజలతోనే ఉన్నానని చెప్పారు. ఇంతవరకు కనిపించని వాళ్లు.. నేడు ఓట్ల కోసం వస్తున్నారని విమర్శించారు. ఒక్కసారి ఆలోచించి, పనిచేసే వారిని గుర్తించాలని సూచించారు. రూ.6600 కోట్లతో మహేశ్వరం వరకు మెట్రో రైలు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కందుకూరు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు. మీర్‌ఖాన్‌పేటలో మెడికల్ కాలేజీ, 450 పడకల దవాఖాన వస్తుండటంతో మన ముంగిట్లోకి వైద్య సేవలు రానున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో లా కళాశాల ఏర్పాటుచేసుకుని విద్యాభివృద్ధికి బాటలు వేసుకున్నామన్నారు. ఒక ఆడబిడ్డగా పోటీచేస్తున్నానని.. మద్దతివ్వాలని కోరారు. ఇష్టంలేకున్నా పోటీ చేస్తున్న వ్యక్తులను కాకుండా.. ఐదేండ్లు జనంమధ్యలో ఉండే తననే గెలిపించాలన్నారు. ప్రజల్లో చిచ్చుపెట్టి, అభివృద్ధి పట్టని పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అభివృద్ధి సర్కార్‌కు అండగా ఉండండి. చేవెళ్లలో చెల్లని రూపాయి, మేడ్చల్‌లో చెల్లని రూపాయి మహేశ్వరంలో చెల్లుతుందా? ఆలోచించాలన్నారు.




మొయినాబాద్: పనిచేసే ప్రభుత్వాన్ని, నాయకుడిని ప్రోత్సహించడం ప్రజల బాధ్యతని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. రెండుసార్లు ప్రజలు ఆశీర్వదిస్తే సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల కళ్ల ముందే ఉన్నాయని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. చేవెళ్లకు ఇచ్చిన మాట ప్రకారం 111 జీవోను ఎత్తేశామని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ జీవోలో ఉన్న న్యాయపరమైన చిక్కులను పరిష్కరిస్తామని చెప్పారు. చేవెళ్ల భారాస అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన శాసనసభ్యుల్లో ఒకరని కేటీఆర్ అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనుల గురించి సీఎంకు ఆయన చెప్తూనే ఉంటారన్నారు. చీమకు కూడా హానిచేయని మనస్తత్వం యాదయ్యదని చెప్పారు. తెలంగాణతో పాటు చేవెళ్ల ప్రశాంతంగా ఉండాలంటే కారు గుర్తుపై ఓటు వేసి భారాసను గెలిపించాలని కేటీఆర్ కోరారు. చేవెళ్లలో మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.

**డిసెంబరు 3 తర్వాత కొత్త రేషన్‌కార్డులు :** గంగా జమునా తెహజీబ్ తరహాలో కేసీఆర్ పాలన సాగిస్తున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. వికారాబాద్ రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని మతాలకు సమప్రాధాన్యం ఇచ్చిన నేత కేసీఆర్ ఒక్కరేనని అన్నారు. బతుకమ్మ పండగ, రంజాన్, క్రిస్మస్ ఇలా ఏ పండగ వచ్చినా భారాస ప్రభుత్వం కానుకలు అందజేసిందని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రశాంత నగరంగా మార్చి పాలించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. "పాలమూరు-రంగారెడ్డిపై కాంగ్రెస్ లేనిపోని ఆరోపణలు చేస్తోంది. ఆ పార్టీ గతంలో వికారాబాద్‌లో జూనియర్ కళాశాల కూడా పెట్టలేదు. డిసెంబరు 3 తర్వాత కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తాం. భారాస పాలనలో విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయి. కరెంట్ కావాలో కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలి.

కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇస్తున్నారు. 24 గంటల కరెంట్‌పై రేవంత్‌కు అనుమానం ఉంటే తీగలను పట్టుకొని చూడాలి. కరెంట్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు. గత కాంగ్రెస్ హయాంలో తాగునీటి సమస్య ఉండేది. కాంగ్రెస్‌కు గతంలో 11 ఛాన్సులు ఇచ్చారు. మళ్లీ ఇప్పుడొచ్చి ఒక ఛాన్స్ అడుగుతున్నారు" అని కేటీఆర్ వివరించారు.




హైదరాబాద్: రాష్ట్రంలో పేదలు బతికే పరిస్థితి లేదని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారిని ఆదుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం జవహర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. భారాస నేతలు మేడ్చల్‌కు తెస్తామన్న ఐటీ పార్కు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. జవహర్‌నగర్‌లో డంపింగ్ యార్డు విషయంలో కోర్టుకు వెళ్లి ఆదేశాలు తీసుకొచ్చినా తరలించలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలను ఆదుకుంటాం. మ హాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.2,500 అందజేస్తాం. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తాం. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. కాంగ్రెస్ హయాంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర.. ఇప్పుడు రూ.1200కి చేరింది" అని రేవంత్ అన్నారు.

## ఎన్నికల తర్వాత అంతు చూస్తానంటూ.. సొంత పార్టీ నేతలకు రాజాసింగ్ వార్నింగ్..



హైదరాబాద్ : బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంత పార్టీ నేతలకు వార్నింగ్ ఇచ్చారు. గత కొద్ది రోజులుగా సొంత పార్టీ నేతలే తన వెనుక గొయ్యి తవ్వుతున్నారని ఆయన ఆరోపిస్తూ వస్తున్నారు. నేడు వారందరికీ ఆయన మాస్ వార్నింగ్ ఇచ్చారు. తన వ్యూహాలను సొంత మనుషులే తన ప్రత్యర్థులకు చేరవేస్తున్నారంటూ రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల తర్వాత మోసం చేసే వారి అంతు చూస్తానని వార్నింగ్ కూడా ఇచ్చారు. 2018లో తనను ఓడించటానికి ప్రయత్నించిన వారి లిస్ట్ తన దగ్గరుందని పేర్కొన్నారు. ఎవరెవరు తన ప్రత్యర్థులతో టచ్‌లో ఉన్నారనే విషయం తనకు బాగా తెలుసని పేర్కొన్నారు.

## బోడుప్పల్‌లో మల్లారెడ్డికి షాక్.. హస్తం గూటికి బీఆర్ఎస్ కార్పొరేటర్లు..

హైదరాబాద్ : ఎన్నికల వేళ కారు పార్టీకి షాక్ తగిలింది బీఆర్ఎస్ పార్టీకి చెందిన బోడుప్పల్ కార్పొరేషన్ ఐదుగురు కార్పొరేటర్లు కారు హస్తం అందుకున్నారు. గురు వారం నాడు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డిల అధ్వర్యంలో టీ.పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన వారిలో 23 డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్, ఒకటవ డివిజన్ కార్పోరేటర్ బింగి జంగయ్య యాదవ్,13 వ డివిజన్ కార్పోరేటర్ దానగళ్ల అనితా యాదగిరి,20 వ డివిజన్ కార్పోరేటర్ జడిగే మహేందర్ యాదవ్,24 వ డివిజన్ కార్పోరేటర్ గుర్రాల రమా వెంకటేష్ యాదవ్ లు ఉన్నారు.







హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరిలో 2,290 మంది అభ్యర్థులు మిగిలారు. బుధవారం 608 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. భారాస అధినేత, సీఎం కేసీఆర్ బరిలో నిలిచిన గజ్వేల్ నియోజకవర్గంలో అత్యధికంగా 70 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడం గమనార్హం. ఆ నియోజకవర్గంలో 44 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. సీఎం పోటీ చేస్తున్న మరో నియోజకవర్గమైన కామారెడ్డిలో 39 మంది అభ్యర్థులు తుది పోరులో ఉన్నారు. ఆ తర్వాత ఎల్‌బీ నగర్‌లో అత్యధికంగా 48 మంది, పాలేరులో 37, కోదాడలో 34, నాంపల్లిలో 34, ఖమ్మంలో 32, నల్గొండలో 31, కొత్తగూడెంలో 30 మంది ఎన్నికల బరిలో నిలిచారు. నామినేషన్ల ఘట్టం పూర్తవడంతో ఎన్నికల ప్రచారం ఇక మరింత జోరు అందుకోనుంది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు 30వ తేదీన పోలింగ్ జరగనుండగా.. 28న ప్రచారం ముగియనుంది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15 లక్షలకు పెంచుతాం: మంత్రి హరీశ్



జహీరాబాద్: 12 సార్లు ఎన్నికల్లో గెలిపించినా జహీరాబాద్‌కు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. జహీరాబాద్‌లో జరిగిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటకలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఎందుకు నెరవేర్చలేదు? అని ప్రశ్నించారు. కర్ణాటకలో అమలు చేయలేని హామీలను తెలంగాణలో నెరవేరుస్తారా? అని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో 5 గంటల కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ప్రస్తుతం అక్కడ రైతులకు 2 గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.

భారాస మళ్లీ అధికారంలోకి వస్తే రైతుబంధు కింద ఎకరాకు రూ.16 వేలు ఇస్తామన్నారు. జనవరి నుంచి అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడమే కాకుండా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15 లక్షలకు పెంచబోతున్నామని మంత్రి హరీశ్ హామీ ఇచ్చారు.

## తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందింది: హోంమంత్రి

ఖమ్మం జిల్లా: మంత్రి పువ్వాడ అజయ్ కోసం తాను ఖమ్మంలో ప్రచారానికి వచ్చానని, ఎంపీ నామా నాగేశ్వరరావు పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ తరపున మాట్లాడతారని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం మంత్రి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, మైనార్టీల అభివృద్ధి ఎంతగానో జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్ల అధికారంలో ఉండి మైనార్టీలకు ఎటువంటి పథకాలు అందించలేదని విమర్శించారు. అంతకుముందు ముస్లింలు ఎక్కువగా హోటల్, మెకానిక్ పనులు చేసేవారని, తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ముస్లింల కోసం స్కూల్స్, కాలేజీలు నిర్మించి ముస్లింల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని మహమూద్ అలీ కొనియాడారు. మైనార్టీల కోసం రూ. 2,400 కోట్లు ఖర్చు చేశారని, ఎంతోమంది ముస్లిం పిల్లలకు బీఆర్ఎస్ అండగా నిలిచిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం షాధీ ముభారక్ పథకం ప్రవేశ పెట్టి ముస్లిం ఆడబిడ్డలకు అండగా నిలిచిందన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్కరోజు కర్ఫ్యూ విధించలేదని, కాంగ్రెస్, టీడీపీ పార్టీలు రెండు అధికారంలో ఉన్నసమయంలో ఎన్నోసార్లు కర్ఫ్యూ విధించాయని మహమూద్ అలీ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు కరెంట్ సరిగా ఉండేది కాదని, ఇండస్ట్రియల్స్‌కు, రైతులకు కరెంట్ కూడా ఇచ్చేవారు కాదని, బీఆర్ఎస్ వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో ఇంటింటికీ నల్లా పెట్టించిన ఘనత కేవలం సీఎం




కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని, దేశంలో బియ్యం పండించడంలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. టీపీసీసీ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు కాదని, ఆయన ఆర్ఎస్ఎస్‌కు చెందిన నాయకుడని మహమూద్ అలీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి 20 మంది సీఎంలు ఉన్నారని, బీఆర్ఎస్‌కు కేవలం ఒక్కరే సీఎం అని, అది కేసీఆర్ అని మంత్రి పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం అందించింది మహాత్మా గాంధీ అని, రాష్ట్రానికి స్వాతంత్ర్యం అందించింది సీఎం కేసీఆర్ అని, ఎన్నికలు ప్రతి 5 ఏళ్లకు వస్తాయని, గతంలో ఖమ్మం ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉందో ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు హోంమంత్రి మహమూద్ అలీ సూచించారు.

## లక్ష్మీనరసింహ స్వామి కూడా కేసీఆర్‌కు వ్యతిరేకమే..



సిద్దిపేట : వర్గల్ మండలంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. మరోసారి కేసీఆర్ గెలిస్తే దేవాలయ భూములను కూడా అమ్మేస్తాడన్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో కేసీఆర్ వంద కోట్లతో అభివృద్ధి చేస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. యాభై, అరవై సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వాలు గ్రామాల్లో ఇచ్చిన బీదలకు ఇచ్చినటువంటి భూములను గుంజుకోవడం తప్ప కేసీఆర్ చేసిన అభివృద్ధి శూన్యమని ఈటల పేర్కొన్నారు. లక్ష్మీ నరసింహ స్వామి కూడా కేసీఆర్‌కు వ్యతిరేకమేనని.. పులి గోరు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ఈటల ఆరోపించారు. మరోసారి కేసీఆర్‌కు ఓటేస్తే తమ గ్రామాలను కూడా మిగిల్చడని ప్రజల్లో భయం పట్టుకుందన్నారు. కేసీఆర్ అర చేతిలో వైకుంఠం చూపిస్తాడు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. కేసీఆర్ పై ప్రజలు కసితో ఉన్నారన్నారు. కొత్తగా వచ్చిన తననే ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. తనకు భయపడి ఓటర్లకు మద్యం డబ్బులు విడతల వారీగా కేసీఆర్ పంపిణీ చేయనున్నాడని ఈటల రాజేందర్ ఆరోపించారు.

## బీఆర్ఎస్ పార్టీ వాళ్లు చేపల్లాంటి వాళ్లు.. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు కప్పల వంటి వాళ్లు



కోరుట్ల : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లోకి పోనివ్వవద్దని, తెలంగాణను తెర్లు చేసుకోవద్దని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ గెలిస్తే ప్రజల బతుకులు బాగుంటాయని చెప్పారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రజలు గెలుస్తారని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను గెలిస్తే కేవలం ఆ పార్టీలు మాత్రమే గెలుస్తాయని, కాబట్టి కారు గుర్తుకు ఓటేసి నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలు గెలవాలని తేల్చి చెప్పారు. గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి కవిత బండలింగాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ..గ్రామాల్లో చెరువులు నీళ్లతో కళకళలాడుతున్నాయని తెలిపారు. "చెరువు ఎండిపోయినప్పుడు చెరువును విడిచిపెట్టి కప్పలు వెళ్లిపోతాయి. కానీ చేపలు మాత్రం చెరువు నిండినా ఎండినా అక్కడే ఉంటాయి. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు చేపల్లాంటి వాళ్లు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు కప్పల వంటి వాళ్లు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం బీజేపీ ఎప్పుడూ మాట్లాడలేదని, సీఎం కేసీఆర్ దీక్ష చేసేంత వరకు ఒక్కరు మాట్లాడలేదని విమర్శించారు. వాళ్ల మెడలు వంచి తెలంగాణ తెచ్చుకున్నామని స్పష్టం చేశారు. చెరువులు ఎండిన నాడు ప్రజలతో బీఆర్ఎస్ ఉందని, ఇప్పుడు చెరువులు నిండిననాడు కూడా ప్రజలతోనే బీఆర్ఎస్ ఉందని వివరించారు. కష్టంలో ఉన్నప్పుడు మనతో ఉంటేనే మనవాడు అవుతారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దని, బీడీ కార్మికుల పెన్షన్లకు కటాఫ్ డేట్ తీసేస్తామని సీఎం కేసీఆర్ అన్నారని, కాబట్టి ఎన్నికల తర్వాత బీడీ కార్మికులందరికీ పెన్షన్లు వస్తాయని చెప్పారు. అన్ని వర్గాల వారికి సీఎం కేసీఆర్ మద్ధతిస్తున్నారని వివరించారు.

## బీఆర్ఎస్‌కు ఓట్లడిగే అర్హత లేదు.. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం..



ఖైరతాబాద్ : 9 సంవత్సరాలు అధికారంలో ఉండి ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిన అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి అన్నారు. బుధవారం ఆమె కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానికులతో కలిసి ఖైరతాబాద్ మహాభారత్‌నగర్, ఇందిరానగర్, బీజేఆర్‌నగర్, మారుతీనగర్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఆమెకు అడుగడుగునా స్థానికులు స్వాగతించి విజయం సాధిస్తావనే ధీమాను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే న్యాయం జరిగిందని గుర్తు చేశారు. పార్టీకి నష్టం వాటిల్లుతుందని తెలిసినా, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి త్యాగం చేసిన సోనియాగాంధీ నాయకత్వంలో తిరిగి కాంగ్రెస్ పాలన వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు తప్పకుండా అమలు చేస్తామని, పేద ప్రజలు గౌరవ ప్రదంగా బతికేలా తమ పార్టీ ఆలోచనలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ షరీఫ్, ఎన్ఎసయూఐ, యువజన కాంగ్రెస్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com